ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
సోమవారం 21 జూలై 2025

ఎవరికీ పట్టని.. పట్టిసీమ!



విరిగిన పట్టిసీమ ఎత్తిపోతల పథకం ప్రధాన ద్వారం షట్టర్

అస్తవ్యస్తంగా ఎత్తిపోతల నిర్వహణ

- విరిగిన ప్రధాన ద్వారం షట్టర్..
- ఇప్పటికీ మరమ్మతులు శూన్యం
- 24 మోటార్లకు 22 మోటార్లే దిక్కు
- మరమ్మతులకు నోచుకోని మరో రెండు మోటార్లు
- అరకొరగా సిబ్బంది.. ఉన్న వారిపై పని ఒత్తిడి



పట్టిసీమ పథకం పైపుల ఎయిర్‌వాల్వ్ లీకై వృథాగా పోతున్న నీళ్లు (ఫైల్)

పోలవరం, జూలై 20(ఆంధ్రజ్యోతి):పట్టిసీమ ఎత్తిపోతల పథకం నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో ఎత్తిపోతల పథకం ప్రధాన లక్ష్యానికి గండి పడుతోందని రైతులు, గ్రామస్థులు, పలువురు కూటమి నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యే నాటికి రాయలసీమ, కృష్ణా, పశ్చిమ డెల్టాల రైతులు సాగునీటికి, ప్రజలు తాగునీటికి ఇబ్బందులకు గురి కాకూడదనే లక్ష్యంతో 2014లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిపాదించారు. కేవలం ఏడాది వ్యవధిలో రూ.1,600 కోట్లతో ఈ పథకం నిర్మించారు. తొలుత నిర్వహణ బాధ్యతలు పథకం నిర్మాణ కంపెనీ మేఘా తీసుకోవడంతో నిర్వహణ సక్రమంగానే సాగింది. ఇటీవల పవర్ సొల్యూషన్ సంస్థకు బాధ్యతలు అప్పగించిన నాటి నుంచి నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో పథకం ప్రధాన లక్ష్యానికి గండిపడే పరిస్థితులు నెలకొన్నాయి.

కానరాని పర్యవేక్షణ

మూడేళ్ల క్రితం పట్టిసీమ ఎత్తిపోతల పథకం ఎడమ ప్రధాన ద్వారం షట్టర్ విరిగి కిందపడడంతో పథకానికి ఒకవైపు రక్షణ పూర్తిగా కరువయ్యింది. దీనికి తోడు రెగ్యులర్ పర్యవేక్షణ లేకపోవడంతో తరచూ నీటి పంపిణీ ప్రధాన పైపులైన్ల పొడవునా ఎయిర్ వాల్వ్‌లు లీకేజీలు ఏర్పడి పంటలు దెబ్బతినడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. 24 మోటార్లు 24 పంపులు పనిచేయాల్సి ఉండగా నిర్వహణా లోపంతో ప్రస్తుతం 22 మోటార్లు మాత్రమే పని చేస్తున్నాయి. మిగిలిన రెండు మోటార్లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో నీటి పంపిణీ తగ్గింది.

అరకొరగానే సిబ్బంది విధులు

నాన్ వర్కింగ్ సమయంలో 49 మంది సిబ్బంది, వర్కింగ్ సమయంలో 72 మంది సిబ్బంది మూడు షిఫ్టులలో 72 మంది సిబ్బంది పని చేయాల్సి ఉండగా నిర్వహణా భారం పేరిట సిబ్బందిని తగ్గించి కేవలం 20 మంది సిబ్బందిని మాత్రమే కొనసాగించడం వల్ల సిబ్బందిపై పని ఒత్తిడి పెరిగి పథకం నిర్వహణ కుంటుపడుతోందన్న ఆరోపణలున్నాయి. వాస్తవానికి రెండు మోటార్లకు ఒక ఎలక్ట్రీషియన్‌తో పాటు సిబ్బందిలో ఒకరిని వినియోగించాల్సి ఉంది. అయితే తక్కువ మంది సిబ్బంది పని చేస్తున్నారని ఈ విషయంపై అధికారుల పర్యవేక్షణ కరువయ్యిందని పలువురు రైతులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. దీనిపై ఏఈ వినోద్‌ని వివరణ కోరగా 24 మోటార్లు వర్కింగ్ కండిషన్‌లోనే ఉన్నాయని అవసరాన్ని బట్టి మోటార్లు వినియోగిస్తామని, సిబ్బంది అవసరం ఉన్నంత వరకు పని చేస్తున్నారని తెలిపారు.

తాడిపూడి నీళ్ల కోసం ఎదురుచూపులు



కంసాలిగుంట వద్ద తాడిపూడి కాలువలో అరకొరగా నీరు

ఉంగుటూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి):తాడిపూడి కాలువ నీళ్ల కోసం మెట్ట రైతాంగం ఎదురు చూస్తున్నా రు.ఒకవైపు వేసవిని తలపిస్తున్న ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వర్షాభావానికి తోడు మరోవైపు తాడిపూడి నుంచి అరకొరగా నీటిని విడుదల చేయడంతో సార్వా సాగు ఆలస్యమయ్యే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా తాళ్ళపూడి మండలం తాడిపూడి వద్ద గోదావరి నుంచి ఎనిమిది పంపుల ద్వారా కాలువలోకి ఎత్తిపోస్తారు. ఈ కాలువ నీళ్ల కోసం దేవరపల్లి, నల్లజర్ల, ఉంగుటూరు, భీమడోలు, ద్వారకా తిరుమల, దెందులూరు మండలాల రైతులు ఎదురు చూస్తుంటారు. ప్రస్తుతం తాడిపూడి నుంచి రెండు పంపుల ద్వారా సుమారు 300 క్యూసెక్కులు నీటిని మాత్రమే తోడి పోస్తున్నారు. దీంతో కాలువలో ప్రవాహ వేగం నామ మాత్రంగా ఉంది. ఉంగుటూరు మండలంలో గొల్లగూడెం, కంసాలిగుంట, అక్కుపల్లిగోకవరం గ్రామాల పరిధిలో సుమారు రెండు వేల రెండు వందల ఎకరాల ఆయకట్టు తాడిపూడి కాలువపై ఆధార పడి ఉంది. మరో రెండు మూడు రోజులకు గాని మండల ఆయకట్టుకు నీరందని పరిస్థితి. అదీకూడా అరకొరగానే అందుతుందని రైతులు వాపోతున్నారు. జూన్‌లో కాలువకు నీరు విడుదల చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు నీరు అందలేదని గొల్లగూడెంకు చెందిన టెంకాయల ఈశ్వరరావు, అక్కుపల్లిగోకవరానికి చెందిన నెక్కంటి ఆదినారాయణ పేర్కొన్నారు.

నారుమళ్ల రైతుల ఆందోళన

ఉంగుటూరు మండలం రావులపర్రు ఆయకట్టులోని బాడవ కింద సుమారు 150 ఎకరాల నారుమళ్లు నీట మునిగాయి.తోకలపల్లి ప్రధాన మురుగు కాలువ రావులపర్రు రెగ్యులేటర్ వద్ద చెక్క బల్లలు దించడం వల్ల ఈ పరిస్థితి ఉత్పన్నమైందని, పత్తేపురం చేపల చెరువుల కోసం నీటి ప్రవాహాన్ని పెంచేందుకు అనుమతి లేకుండా చెక్కబల్లలు దించేశారని రైతులు వాపోతున్నారు. ఇరిగేషన్ అధికారులకు ఫోన్లు చేసినా స్పందించడం లేదన్నారు. రైతులు బయ్యవరపు శ్రీను, ఎడవల్లి శ్రీను, నల్లి హరికృష్ణ, తాడిశెట్టి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.





చేవూరు పంట కాల్వలో పేరుకుపోయిన గుర్రపు డెక్క

కాలువలు ఇలా.. పొలాలకు నీరెలా..?

- గుర్రపు డెక్కతో నిండిన బ్రాంచి కాలువలు
- నీరందక రైతుల ఆందోళన

ముదినేపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పంట కాలువలు గుర్రపు డెక్క, తూటుతో నిండిపోయాయి.ప్రధాన పంట కాలువలు నుంచి విడుదల చేస్తున్న కొద్దిపాటి నీరు పొలాలకు చేరే అవకాశం లేకుండా పోయింది. ముదినేపల్లి ప్రాంతంలోని పోల్‌రాజ్, క్యాంప్ బెల్ ప్రధాన పంట కాలువలకు చెందిన బ్రాంచి కాలువలు అత్యధిక శాతం గుర్రపు డెక్కతో నిండిపోవడంతో సాగు నీరు కదిలే పరిస్థితి లేకుండాపోయింది. సార్వా సీజనుకు ముందే పంట కాలువల నిర్వహణపై జల వనరుల శాఖ అధికారులు దృష్టి పెట్టకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. క్యాంప్ బెల్ కెనాల్‌కు సంబంధించిన పలు పంట కాలువల్లో నీటి ప్రవాహం స్తంభించేలా గుర్రపు డెక్క పేరుకుపోగా, పోల్‌రాజ్ కెనాల్‌కు చెందిన అన్నవరం, గురజ తదితర బ్రాంచి కాలువలు డెక్కతో నిండి కాలువ కనిపించని పరిస్థితి నెలకొంది. చేవూరు పొలిమేరకోడు పంట కాలువ పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. గుర్రపు డెక్క తొలగింపునకు ప్రభుత్వం నుంచి కొంత నిధులు మంజూరయ్యాయి. అయితే వాటి వినియోగంలో విధించిన నిబంధనల కారణంగా పనులు చేపట్టేందుకు నీటి సంఘాల అధ్యక్షులు, సభ్యులు ముందుకు రావడం లేదు.

బిల్లులు సత్వరం చెల్లించాలి



పంట కాలువల్లో గుర్రపు డెక్క బాగా పేరుకు పోయింది. నీరు ప్రవహించే అవకాశం లేదు. డెక్క తొలగింపు పనులకు ఎప్పటికప్పుడు బిల్లులు చేసి చెల్లింపులు జరపాలి. ఇప్పుడు చేసే పనులకు 2026 మార్చి తర్వాత బిల్లులు చేస్తామని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఇలా అయితే పనులు జరగవు. పొలాలకు నీరు అందదు.

- శాయిన ప్రసాదరావు, నీటి సంఘం అధ్యక్షుడు, చేవూరు



గురజ ఇసుక కాలువలో దట్టంగా గుర్రపు డెక్క

నేడు పీజీఆర్‌ఎస్‌లో వినతుల స్వీకరణ : కలెక్టర్

ఏలూరు రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని వేగవంతంగా, ప్రజలకు మరింత చేరువ చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ సేవలను సోమవారం మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిల్లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెట్రిసెల్వి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్ గోదావరి సమావేశం మందిరంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి పీజీఆర్ఎస్ జరుగుతుందన్నారు. ప్రజలు ఫిర్యాదులను సమీప మండల, డివిజనల్, మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించవచ్చు న్నారు. ఇంటి నుంచే హెచ్‌టీటీపీఎస్://మీకోసం.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

బీఎండీ చానల్ షట్టర్ల ఏర్పాటుకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ముదినేపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బంటుమిల్లి మెయిన్ డిస్ట్రిబ్యూటరీ చానల్‌కు కమలాపురం లాకుల వద్ద శిథిలమైన షట్టర్ల స్థానంలో కొత్తగా షట్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు బంటు మిల్లి సెక్షన్ ఇరిగేషన్ ఏఈ రాజ్యలక్ష్మి తెలిపారు. 'బీఎండీ చానల్ షట్టర్లు శిథిలం' శీర్షికన శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. కొత్త షట్టర్ల ఏర్పాటుకు ఎస్టిమేషన్ వేశామని, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌తో నూతన షట్టర్ల నిర్మాణంపై చర్చించినట్టు తెలిపారు. రైతులు సాగునీటి సమస్యను ఎదుర్కొకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

రేటుంది..రొయ్యేది!

ముదినేపల్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి): రొయ్యల మార్కెట్‌లో డిమాండ్‌కు తగినంత రొయ్యల ఉత్పత్తి లేక ధరలు ఆశాజనకంగా ఉన్నా రైతులకు ప్రయోజనం లేకుండా పోయింది. మార్కెట్‌లో ధరలు పెరిగినా రైతుల వద్ద అమ్మకానికి రొయ్యలు లేవు. గత రెండేళ్లుగా వరుస నష్టాలు ఎదుర్కొంటున్న రొయ్యల రైతులు ముదినే పల్లి ప్రాంతంలో ఆరు నెలల నుంచి ఆక్వా సాగును పక్కన పెట్టి తమ చెరువులకు మరమ్మతులు చేయించే పనులు చేపట్టడంతో రొయ్యల ఉత్పత్తి పడిపోయింది. ఈ పరిస్థితుల్లో పెరిగిన డిమాండ్ మేరకు ఏజెంట్లు, కంపెనీలు రొయ్యలను విదేశాలకు, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయలేని పరిస్థితి. వంద కౌంట్ రొయ్య ధర కేజీకి రూ.220 నుంచి రూ.230, 80 కౌంట్ రూ.240-రూ.260, 60 కౌంట్ రూ.280- రూ.300, 40 కౌంట్ రూ.320 నుంచి రూ.330 వరకు పలుకుతున్నా రైతుల వద్ద రొయ్యలు లేవు. 'రొయ్యల ధరలు ఆశాజనకంగా ఉన్నా రైతుల వద్ద అమ్మేందుకు రొయ్యలు లేవు.ధర ఉన్నా ప్రయోజనం లేకుండా పోయింది' అంటూ ములకలపల్లికి ఆక్వా రైతు బొప్పన సుందర రామయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

బీసీ వసతి గృహాలకు విద్యార్థులు కావలెను!

సీట్లు మూడు వేలు.. 1969 మందే చేరిక.. క్షేత్రస్థాయిలో విద్యార్థుల వేట



(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

బీసీ వసతి గృహాలను విద్యార్థుల కొరత వేధిస్తోంది. మునుపెన్నడూ లేనివిధంగా ఈ ఏడాది బీసీ వసతి గృహాల్లో విద్యార్థుల చేరికలు ఆలస్యం అయ్యాయి. సంఖ్యా పరంగా ఒక్కొక్క వసతి గృహంలో వంద మంది ఉండడానికి అవకాశం ఉండగా.. కేవలం 60 మందిలోపే బస చేస్తున్నట్టు చెబుతున్నారు. ఒకప్పుడు బీసీ వసతి గృహాల్లో సీటు కోసం ప్రజాప్రతినిధులు, ఇతర ముఖ్యుల సిఫార్సులతో పోటీ పడేవారు. సీట్లు సంఖ్య పెరిగినా... ఈ ఏడాది అవి ఎందుకు భర్తీ కాలేదోనన్న ఆందోళన అధికారులను వెంటాడుతోంది. దీంతో అధికారులు క్షేత్రస్థాయిలో విద్యార్థుల వేటలో పడ్డారు.

బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో మొత్తం 35 వసతి గృహాలున్నాయి. ఏటా ఒక్కొక్క వసతి గృహంలో వందమంది విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పించడానికి అవకాశం ఉంది. ఒకటో తరగతి నుంచి టెన్త్, ఇంటర్, పీజీ వరకు ఇక్కడ ఉంటూ సమీప స్కూళ్లు, కాలేజీల్లో చదువుకోవడానికి మొత్తం మూడువేల మందికి అవకాశం ఉండగా ఇప్పటి వరకు 1,969 మందే సేవలను పొందుతున్నారు. ఇంకా వెయ్యిమంది వరకు వసతి పొందేందుకు అవకాశం ఉంది. ప్రతీ విద్యార్థికి కాస్మోటిక్స్ చార్జీలను ప్రభుత్వం వారి తల్లిదండ్రుల ఖాతాలకు జమ చేస్తోంది.

మెనూ అదుర్స్..హాస్టళ్లు బాగు చేసినా..

జిల్లాలో 35 వసతి గృహాలకు 14 భవనాలు ప్రభుత్వ ఆధీనంలో ఉండగా, మిలిగిన 21 వరకు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఏలూరులోనే అత్యధికంగా అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అయితే టీడీపీ ప్రభుత్వం వచ్చాక 13 కేంద్రాల్లో టాయిలెట్లు నిర్మాణం, ఇతరత్రా మరమ్మతులను రూ.1.50 లక్షల చొప్పున ప్రతీ కేంద్రానికి వెచ్చించారు. మెనూలో మార్పులను చేశారు. ఉదయం పాలు, అల్పాహారం (ఇడ్లీ, పులిహోర తదితర వెరైటీలతో పాటు గుడ్డు) అందిస్తున్నారు.సాయంత్రం స్నాక్స్, రాత్రిపూట భోజనం తర్వాత అరటి పండును అందిస్తున్నారు. మొత్తం మీద వారానికి ఆరు కోడిగుడ్లతో పాటు, మూడు రోజులు చికెన్ పెడుతున్నారు. ఇన్ని సౌకర్యాలు కల్పిస్తున్నా ఇంకా సీట్లు మిగిలి ఉండడం గమనార్హం.

ప్రత్యేక డ్రైవ్ చేపట్టాం

గతం కంటే బీసీ వసతి గృహాల్లో సౌకర్యాలను పెంచాం. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు స్పెషల్ డ్రైవ్ కొనసాగిస్తున్నాం. ఆగస్టులోగా ఇవి భర్తీ అవుతాయని భావిస్తున్నాం. ముఖ హాజరుతో భోజనం, పౌష్టికాహారం అందిస్తున్నాం. ఇంకా ఎవరైనా చేరాల్సిన విద్యార్థులుంటే సమీప వసతి గృహ అధికారులను సంప్రదించవచ్చు.

- బీసీ వెల్ఫేర్ అధికారి ఆర్‌వీ.నాగరాణి

మరణంలోను తోడుగా..

గంట వ్యవధిలో దంపతుల మృతి.. చాట్రాయి మండలం పోలవరంలో విషాదం



వెంకటేశ్వరరావు, పాప(ఫైల్)

చాట్రాయి, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఒకే రోజు గంట వ్యవధిలో భార్యా భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో మండలంలోని పోలవరంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ జీవనం చేస్తున్న తేళ్ళూరి వెంకటేశ్వరరావు(65), తేళ్ళూరి పాప(55) ఒకే రోజు కన్నుమూయడం కుటుంబ సభ్యులు బంధువులు గ్రామస్తులు జీర్ణించుకోలేక పోతున్నారు. పాప కొన్ని నెలల క్రితం కేన్సర్ బారిన పడటంతో ఆమెను బతికించుకోవాలని భర్త, కుమారుడు, కుటుంబ సభ్యులు తాహతును మించి ఖర్చు పెట్టి చికిత్స చేయిస్తున్నారు. ఈలోగా భర్త వెంకటేశ్వరరావుకు ఊపిరితిత్తులలో సమస్య రావడంతో విజయవాడ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఈక్రమంలోనే ఆదివారం భార్య పాప పరిస్థితి విషమించి చనిపోయింది. తన కళ్ల ముందే భార్య చనిపోవడంతో కలత చెందిన వెంకటేశ్వరరావు గంట వ్యవధిలోనే తుదిశ్వాస విడిచాడు. ఈ దంపతుల పెద్ద కుమారుడు మూడేళ్ల క్రితం కేన్సర్‌తో మృతి చెందాడు. రెండో కుమారుడు గ్రామంలోనే కూలీ పనులు చేస్తూ తల్లిదండ్రులకు అండగా ఉండగా, కుమార్తె వివాహం చేశారు. భార్యాభర్తలు ఒకే రోజు చనిపోవటంతో కుటుంబ సభ్యులు బంధువులు బోరుబోరున విలపిస్తున్నారు. మృతి చెందిన దంపతులకు సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు, వైసీపీ నాయకుడు చెలికాని శ్రీరామ్ దంపతుల భౌతికకాయాలకు శ్రద్ధాంజలి ఘటించి కుటుంబీకులకు సంతాపం తెలిపారు. కాగా పాప, వెంకటేశ్వరరావు ఇద్దరిది పోలవరమే స్వగ్రామం. ఈ దంపతులు గ్రామంలో అందరితో కలివిడిగా ఉండేవారని స్థానికులు తెలిపారు. మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు, వైసీపీ నాయకుడు చెలికాని శ్రీరామ్ దంపతుల భౌతిక కాయాలకు శ్రద్ధాంజలి ఘటించి కుటుంబీకులకు సానుభూతి తెలిపారు.



దంపతుల భౌతికకాయాల వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు



పుట్టినరోజు విషెస్ చెప్పలేదని భార్య ఆత్మహత్య

- తట్టుకోలేక భర్త ఆత్మహత్యాయత్నం
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు
- చొదిమెళ్లలో ఘటన.. ఇద్దరూ టీచర్లు

లోపలి పేజీలో..

జిల్లాలో కొనసాగుతున్న వర్షాలు

ఏలూరుసిటీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నా యి. జిల్లాలో ప్రస్తుతం విభిన్న వాతావరణం నెలకొని ఉంది. పగటివేళ వేసవి వాతావరణం, సాయంత్రం సమయంలో భారీ వర్షాలతో వాతావరణం చల్లబడుతోంది. ఆదివారం జిల్లాలో పలుచోట్ల భారీ వర్షాలు కురి శాయి. గత 24 గంటల్లో కామవరపుకోట మండలంలో 78.4 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 7.5 మి.మీగా నమోదైంది. పెదవేగి 47.4, ఆగిరిపల్లి 18.4, దెందులూరు 16.2, చాట్రాయి 15.4, లింగపాలెం 13.8, ముదినేపల్లి 7.6, ఏలూరు అర్బన్ 4.2, ద్వారకాతిరుమల 3.4, జంగారెడ్డిగూడెం 2.4, జీలుగుమిల్లి 2, పోలవరం 1 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి.

స్మార్ట్ మీటర్లపై అపోహలొద్దు

- బిల్లుకు అదనంగా ఎటువంటి చార్జీలు ఉండవు
- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

కుట్టు..మహిళల ఉపాధికి మెట్టు

- ఉమ్మడి జిల్లాలో 62 కేంద్రాలు.. 7,301 మందికి శిక్షణ

లోపలి పేజీలో..



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కావిడి మోస్తున్న ఎమ్మెల్యే కామినేని

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కావిడి మహోత్సవం

- కావిడి మోసిన ఎమ్మెల్యే కామినేని.. తరలివచ్చిన భక్తులు

ముదినేపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లో వేంచేసి ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం ఆడికృత్తిక కావిళ్ల మహోత్సవం వైభవంగా నిర్వహించారు. తమిళనాడులోని పళని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఆషాఢ మాసం కృత్తిక నక్షత్రం సందర్భంగా జరిగే తరహాలోనే దేవదాయ ధర్మదాయ శాఖ సింగరాయపాలెం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో తొలిసారిగా నిర్వహించింది. ఉదయం విఘ్నేశ్వర పూజ, సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు, గోపూజ నిర్వహించిన అనంతరం సర్పసూక్త పారాయణం జరిపి దేవస్థానం నుంచి 120 కావిళ్లతో ఈ సేవా ఉత్సవం ప్రారంభమైంది. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆడి కావిడి మోసి ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ మహోత్సవంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. అనంతరం కావిళ్లతో భక్తులు సింగరాయపాలెం, చేవూరుపాలెం, శ్రీహరిపురంల్లో గ్రామోత్సవం నిర్వహించా రు. కృత్తిక నక్షత్రం సందర్భంగా స్వామివార్లకు శాంతి కల్యాణం జరిపారు. రథోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రుద్రరాజు గంగా శ్రీదేవి, అర్చకులు ఆసూరి రంగనాథాచార్యులు, తోలేటి వీరభద్ర శర్మ, గూడూరు శివరామకృష్ణ, నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మండల టీడీపీ అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, బావాజీ మఠం ఈవో కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురానికి ప్రత్యేక రైలు



నరసాపురం,జూలై 20 (ఆంధ్రజ్యోతి): నరసాపురం స్టేషన్‌కు ప్రత్యేక రైలు కేటాయించారు. 20 కోచ్‌లతో ఉండే ఈ రైలు బెంగళూర్, అర్సికెరె, అరుణాచలం (తిరువణ్ణామలై) వీక్లీ స్పెషల్‌గా నడుస్తున్నది. ఈ రైలు నిర్వహణ అంతా నరసాపరం స్టేషన్‌లోనే చేస్తున్నారు. ఆదివారం ఈ రైలు బెంగళూరు మీదుగా అర్సికెరె వెళ్లుతుంది. బుధవారం అరుణాచలం, శుక్రవారం రేణుగుంట మీదుగా యశ్వంత్‌పూర్ వెళుతుంది. ఇలా వారంలో మూడు ట్రిప్పులు, మూడు ప్రాంతాలకు నడుస్తోంది. అయితే మంచి డిమాండ్ ఉన్న రూట్లలో నడపడం వల్ల రెండు నెలల ముందుగానే టిక్కెట్లు నిండు కుంటున్నాయి. అరుణాచలం ఆగస్టు వరకు, యశ్వంత్‌పూర్‌కు ఆగస్టు వరకు ఫుల్ అయ్యాయి. ప్రస్తుతం వారానికి ఒక్క రోజు నడుస్తున్న ఈ స్పెషల్ రూట్లలో ఆదనంగా మరో రైలు నడపాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. నరసాపురం స్టేషన్‌కు మరో రైలు కేటాయిస్తే వారంలో రెండు ట్రిప్పులు ఈ రూట్లలో స్పెషల్ రైళ్ల నడిపేందుకు అవకాశం ఉంటుంది.



విజేతలకు బహుమతులు అందిస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

జిల్లా స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ

భీమవరం టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) :యోగా సాధన వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందని, ప్రతి ఒక్కరూ యోగాను ఒక దినచర్యగా చేసుకోవాలని కేంద్ర మంత్రి భూప తిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. భీమవరం బైపాస్ రోడ్డులో ఆంధ్రప్రదేశ్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాస్థాయి యోగాసన పోటీలను భాష్యం పాఠశాలల్లో నిర్వహించారు. పోటీల్లో గెలు పొందిన వారంతా త్వరలో విజయవాడలో జరుగునున్న రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు అర్హత సాధించారని అసోసియేషన్ అధ్యక్షురాలు రాధిక తెలిపారు. జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ ప్రశంసా పత్రాలను అందించారు. కంతేటి వెంకటరాజు, వబిలిశెట్టి వెంకటేశ్వర్లు, కలిదిండి రామకృష్ణ, ఉప్పలపాటి వెంకటేశ్వర రాజు, చంద్రరావు, రామచంద్ర రెడ్డి, భవానీ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



చెస్ పోటీలు ప్రారంభించి ఆడుతున్న మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరంలో రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు

భీమవరం రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): భీమవరం వన్‌టౌన్ జీవీఆర్ కళ్యాణ మండపంలో ఇంటర్నేషనల్ చెస్ డే సందర్భంగా ఇన్విటేషనల్ ఏపీ స్టేట్ ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్ -2025 పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. నిర్వాహకుడు, జిల్లా చదరంగం అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్, గౌరవాధ్యక్షుడు తోట బంగారయ్యలు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న ఈ టోర్నమెంట్‌కు ఆరు జిల్లాల నుంచి వంద మందికి పైగా క్రీడాకారులు విచ్చేశారని, విజేతలకు బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఖరీదైన చందరంగం క్రీడా పుస్తకాలను అందిస్తున్నామని తెలిపారు.ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పులఖండం కోటేశ్వరరావు, కిరాణా మర్చంట్ అసోసియేషన్ కార్యదర్శి అద్దంకి శివప్రసాద్, జిల్లా చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తోట హరిబాబు, సంయుక్త కార్యదర్శి మైలాపురి మురళి, గ్రంధి రవితేజ, అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.



ప్రత్యేక బహుమతి అందుకుంటున్న రంగరాజు

కార్టూన్ పోటీల్లో రిటైర్డ్ టీచర్‌కు ప్రత్యేక బహుమతి

ఉండి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విశాలాక్షి సాహిత్య మాసపత్రిక 16వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీమామిడిపూడి రామకృష్ణయ్య స్మారక జాతీయ స్థాయి కార్టూన్ పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం చెరుకువాడకు చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు రంగరాజు ప్రత్యేక బహుమతి అందుకున్నారు. ఆదివారం నెల్లూరులో ఈ బహుమతిని మండలి మాజీ ఉపసభాపతి, జనసేన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా బహుమతి తీసుకున్నారు.



బాస్కెట్‌బాల్ జూనియర్ బాలికల జట్టు ఎంపిక

ఏలూరు రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏలూరు కస్తూరిబా నగర పాలక బాలికోన్నత పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి బాలికల జట్టును ఎంపిక చేశారు. ఆగస్టు 14 నుంచి 17 వరకు కాకినాడ జిల్లా పిఠాపురంలో జరిగే ఆంధ్రప్రదేశ్ 10వ అంతర జిల్లాల జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలలో వీరు పాల్గొంటారని అసోసియేషన్ జిల్లా సెక్రటరీ జి.శ్రీనివాసరావు, ట్రెజరర్ కె.మురళి కృష్ణ, జాయింట్ సెక్రటరీ ఎం.రమేష్ తెలిపారు.

ఎంపికైన విద్యార్థులు వీరే :

జయశ్రీ, యామిని, రుత్విక, పూజిత, సాయి భవానీ, నందిని, దేవిశ్రీ, జి.సరిత, ఎస్ ఖుషీ హసిని, డి.సాయి శ్రీలాస్య, ఏ.రియా, పి.శాంతి, సులోచన ఎంపికయ్యారు. స్టాండ్‌బైగా ఎన్.రేణుక, సత్యశ్రీ, కే.రుచిత, జి.యేసు ప్రశాంతి ఎంపికయ్యారు. చంద్రశేఖర్, రిటైర్డ్ హెచ్ఎం జిల్లా వీరభద్రరావు, స్కూల్‌హెచ్ ఎం.మాధవిలత, ఎస్.సాంబశివరావు, పీడీలు వై.సురేష్, గోపాల్, బి.సత్యనారాయణ పర్యవేక్షించారు.

కుట్టు..మహిళల ఉపాధికి మెట్టు



ముసునూరు కుట్టు శిక్షణ కేంద్రంలో పరిశీలిస్తున్న బీసీ కార్పొరేషన్ ఈడీ పుష్పలత

మహిళల ఆర్థిక ఉన్నతికి టైలరింగ్ ప్రధాన ఆయుధంగా మారింది. మహిళల నాడి పట్టి, వారి అవసరాలను గుర్తించిన టీడీపీ ప్రభుత్వం పల్లె, పట్టణం అనే తేడా లేకుండా కుట్టుశిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. దీంతో ఉమ్మడి జిల్లాలో 62 కేంద్రాల్లో 7,301 మంది మహిళలు టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్నారు. మరో నెల పూర్తి అయితే శిక్షణకు తుది మెరుగులు దిద్దుకుని ఉపాధిబాట పట్టనున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

- మహిళల ఆర్థిక ఉన్నతికి టైలరింగ్
- ఉమ్మడి జిల్లాలో 62 కేంద్రాలు...7,301 మందికి శిక్షణ
- ప్రతిభ చూపిన వారికి ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు

మహిళలు ఆర్థికంగా బలోపేతం అవడానికి కుట్టుశిక్షణ తొలి మెట్టుగా మారుతోంది. ఈబీసీ కార్పొరేషన్ ద్వారా అన్ని కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు మూడు నెలలు టైలరింగ్ శిక్షణకు టీడీపీ ప్రభుత్వం ఇటీవల శ్రీకారం చుట్టింది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహిళలు నివాసం ఉన్నచోటే సంపాదనకు అవకాశాలు ఏర్పడుతున్నాయి. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న 18 నుంచి 50 ఏళ్లలోపు మహిళలకు మూడు నెలలు పాటు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు 62 కేంద్రాలను ఏర్పాటు చేయగా మహిళల నుంచి విశేష స్పందన లభించింది. స్థానికంగా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల ద్వారా దరఖాస్తులు ఆహ్వానించారు. వడపోత అనంతరం వివిధ శిక్షణా ఏజెన్సీల ద్వారా కేంద్రాలను వేగంగా ఏర్పాటు చేశారు. వేలకు, వేలుఖర్చుపెట్టి టైలరింగ్ శిక్షణ పొందలేని మహిళలు 7,301 మంది శిక్షణలో చేరారు. ఇప్పటికే రెండు నెలలు పూర్తి అయినట్లు అధికారులు చెబుతున్నారు. మరో నెల పాటు శిక్షణ పొందిన వారికి వివిధ టెస్టులు పెట్టి వారికి ఉచితంగా ప్రభుత్వం కుట్టుమిషన్లును పంపిణీ చేయనుంది. ఉత్తమ ప్రతిభ కనపర్చిన వారికి వివిధ స్పాన్సరింగ్ ఏజెన్సీల ద్వారా ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల్లో శిక్షణకు ఎంపిక చేయనున్నారు. దీంతో పాటు మెరుగైన ప్రతిభ చూపిన వారికి ఇతోధికంగా వివిధ యూనిట్ల స్థాపనకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.

ఈసారి సర్టిఫికెట్ ఆషామాషీ కాదు..

ఉచిత శిక్షణకు వచ్చిన మహిళలు మూడు నెలలు కాలంలో కనీసం 75 శాతం అటెండెన్సీ ఉండాలన్న నియమం పెట్టారు. అలా వస్తేనే సర్టిఫికెట్ ఇస్తారు. వీరికి ముఖ ఆధారిత హాజరును పరిగణనలోకి తీసుకుంటున్నారు. శిక్షణకు దుమ్మా కొట్టడానికి వీల్లేకుండా చేశారు. మహిళల వెసులుబాటు, ఇష్టం ప్రకారం ఉదయం 9 గంటలకు మధ్యాహ్నం 2 గంటల దాటాక రెండు బ్యాచ్‌లుగా ఆయా టైలరింగ్ కేంద్రాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇదిలా ఉండగా కుట్టుశిక్షణ కేంద్రాలను నిరంతరం అధికారులు తనిఖీలు చేస్తున్నారు. బీసీ కార్పొరేషన్ ఈడీ పుష్పలత ఉమ్మడి జిల్లాలోని కేంద్రాల పనితీరుపై స్థానిక ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ల సమన్వయంతో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. వారంలో కనీసం పది కేంద్రాలనైనా చుట్టి రావాల్సిందేనని బీసీ కార్పొరేషన్ ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలతో తనిఖీల బాట పడుతున్నారు. శిక్షణ కేంద్రాల సక్రమంగా నడిపించే బాధ్యతను పూర్తిగా ఈడీపైనే పెట్టడంతో తీరిక లేకుండా ఆరా తీయడమే కాకుండా లోటుపాట్లను నివారించడానికి ఆమె స్వయంగా కార్య రంగంలోకి దిగుతున్నారు. కుట్టు శిక్షణ కేంద్రాల అంశంపై ఈడీ పుష్పలత 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ అందరి సమన్వయంతో 62 కేంద్రాలను పారదర్శకంగా నడుపుతున్నామన్నారు. మహిళలు ఎంతో ఉత్సాహం, పట్టుదలతో శిక్షణా కార్యక్రమాలను వినియోగించుకుంటున్నారు. శిక్షణ పూర్తయిన వారికి ప్రభుత్వం కుట్టు మిషన్లు కూడా అందిస్తుందన్నారు.

అమ్మవార్లకు ఆషాఢం సారె

కె.పెంటపాడు పెంట్లమ్మ అమ్మవారికి..

పెంటపాడు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పెంటపాడు మండలం కే.పెంటపాడు గ్రామదేవత పెంట్లమ్మ అమ్మవారిని ఆదివారం శాకంబరిగా అలంకరించారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గంధం సతీష్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పంతం శేఖర్‌ల ఆధ్వర్యంలో గ్రామస్తులు భారీగా తరలి వచ్చి అమ్మవారికి చీర,సారె సమర్పించుకున్నారు.ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, భవన కార్మిక సంక్షేమ మండలి ఛైర్మన్ వలవల బాబ్జీ, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీలు సారె సమర్పించారు. కిలపర్తి వెంకట్రావు, పుల్లా బాబి, దాసరి కృష్ణవేణి, తోటరాజ, నరాలశెట్టి సంతోష్ కుమార్, సర్పంచ్ పీతల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భీమవరం మావుళ్లమ్మకి...

భీమవరం టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మకి ఆదివారం పలువురు భక్తులు వెయ్యి కేజీల సారె అందించారు.పట్టణానికి చెందిన క్వీన్స్ కిట్టి మహిళలు 51 రకాలతో 250 కేజీలు, వీరవాసరానికి చెందిన భక్తులు 150, భీమవరానికి చెందిన పలువురు భక్తులు 200, ఆకివీడుకు చెందిన భక్తులు 220 కేజీల చొప్పున అమ్మవారికి సారెఅందించారని ఇవో మహాలక్ష్మి నగేష్ తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు.



శాకంబరిగా పెంట్లమ్మ అమ్మవారు



అమ్మవారికి సారె అందిస్తున్న క్వీన్ కిట్టీ పార్టీ సభ్యులు... పెంట్లమ్మ అమ్మవారికి సారె అందిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి



తణుకులో జరిగిన బ్రాహ్మణ సేవా సంఘాల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు, యూత్ అధ్యక్షులను సత్కరిస్తున్న సభ్యులు

రాజకీయాలకు అతీతంగా బ్రాహ్మణులు ఐక్యం కావాలి

తణుకు రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా బ్రాహ్మణులు ఐక్యం కావాలని రాష్ట్ర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కోసూరి సతీష్ శర్మ చెప్పారు. ఆదివారం తణుకులో జరిగిన ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య బైలాస్ సవరణ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశానికి ఏపీ బ్రాహ్మణ యూత్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ సేవా సంఘం వ్యవస్థాపకుడు, కుర్తాళం పీఠాధిపతి ఆంజనేయులు స్వస్థలం తణుకులో బైలాస్ సవరణ సమావేశం జరగడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. సంఘ గౌరవ సలహాదారు సత్యవాద దుర్గా ప్రసాద్, బైలాస్ కమిటీ ఛైర్మన్ పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ, జనరల్ సెక్రటరీ హెచ్‌కే మనోహర్, కోశాదికారి పులిపాక ప్రసాద్, బలిజేపల్లి రవిశంకర్, మంత్రిరావు వెంకటరత్నం, తదితరులు మాట్లాడారు. పొన్నా సుధీర్ శర్మ, పార్ధసారధి వివిధ ప్రాంతాలకు చెందిన బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మొగల్తూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు పోలీస్ స్టేషన్ పరిధి సీతారామపురంలోని ఒక ప్రైవేట్ స్కూల్ వద్ద జాతీయ రహదారిపై ఆది వారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువ కుడు మృతి చెందాడు. మొగల్తూరు ఎస్ఐ జి.వాసు తెలిపిన వివరాల ప్రకారం నరసాపురం మండలం రుస్తుంబాద పంచాయతీ యడ్లపల్లివారి తోటకు చెందిన పరసా సాయి చందును (22) ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో బైక్‌పై వస్తున్న మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. మృతుని తండ్రి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మొగల్తూరు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

పెనుగొండ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాజమండ్రిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పెను గొండకు చెందిన వ్యక్తి మృతి చెందారు. పెనుగొండకు చెందిన పూతినీడి ఏడుకొండలు (59) ఈనెల 8వ తేదీన రాజమండ్రిలో నడిచి వెళుతుండగఆ మోటారు సైకిల్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఏడుకొండలు తీవ్ర గాయాల పాలయ్యాడు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఒకరి మృతి

ఏలూరు క్రైం,జూలై 20 (ఆంధ్రజ్యోతి) : రైలు ఢీకొని వ్యక్తి మరణించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ద్వారకాతిరుమల మండలం సత్తెనగూడెంకు చెందిన కొత్తపల్లి అశోక్ (30) శనివారం రాత్రి భీమడోలు రైల్వే గేటు సమీపంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో మృతి చెందాడన్నారు. రైల్వే పోలీసులు మృత దేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మహిళ అదృశ్యం..కేసు నమోదు

టి.నర్సాపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జయబాబు తెలిపారు. మండలంలోని వల్లంపట్ల పంచాయతీ సింగారాయిపాలెం గ్రామానికి చెందిన గొర్రె అనంత (30) భర్త శ్రీనివాస్‌తో గొడవపడి రెండురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల గ్రామాల్లోనూ, బంధువుల ఇళ్ల వద్ద వెతికినప్పటికీ ఆమె ఆచూకి లభ్యం కాలేదు. ఆమె తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకి తెలిసిన వారు 94407 96676 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

పెదపాడు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పెదపాడు మండలం వేంపాడుకు గ్రామానికి చెందిన వివాహిత మన్నెపు హారిక సుధ ఈనెల 18న ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదని ఆమె తల్లి మందపాక సుజాత ఆదివారం పెదపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ గజపతిరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

తణుకు రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తణుకు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందినట్లు పట్టణ ఎస్ఐ శ్రీనివాసు తెలిపారు. తణుకు రూరల్ మండలం తేతలి గ్రామానికి చెందిన గుంటూరి సూర్య కుమారి (38) ఆదివారం సాయంత్రం తన పిన్ని భూపతిరాజు లక్ష్మీతో కలసి స్కూటీపై తేతలి నుంచి తణుకు డీమార్ట్‌కు వెళ్లే క్రమంలో జాతీయ రహదారి పాత టోల్ గేట్ వద్ద యూటర్న్ తీసుకునే క్రమంలో పెరవలి నుంచి తణుకు వైపు వస్తున్న టెంపో మినీబస్ వేగంగా ఢీకొనడంతో సూర్యకుమారికి తీవ్ర గాయాలయ్యాయి. తణుకు ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందినట్లు తెలిపారు. వెనక వున్న లక్ష్మీకి స్వల్ప గాయలైనట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగాధరరావు.. హాజరైన వివిధ జిల్లాల సంఘ నాయకులు

నిబంధనల ప్రకారం పెన్షన్ ఇవ్వాలి

రిటైర్డ్ అధ్యాపకుల రాష్ట్ర కార్యవర్గ సమావేశం

ఏలూరు అర్బన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : రిటైర్డ్ ప్రభుత్వ, ఎయిడెడ్ డిగ్రీ, పీజీ కళాశాలల అధ్యాపకులకు నిబంధనల ప్రకారం అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆదివారం ఏలూరు సీఆర్ఆర్ కళాశాలలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ కాలేజీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సంఘ నాయకులు డిమాండ్ చేశారు. సమావేశంలో చర్చించిన అంశాలు, డిమాండ్లు, తీర్మానాల వివరాలను సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లేళ్ల వెంకటేశ్వరరావు స్థానిక మీడియాకు తెలియజేసారు. కళాశాలల్లో ట్యూటర్లు, డెమాన్‌స్ట్రేటర్లుగా పనిచేసినవారికి 9 శాతం పారితోషికం ఇవ్వాలని కోరారు. అధ్యాపకులకు బకాయివున్న డీఆర్‌లను చెల్లించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. తొలుత లెక్చరర్స్ ఉద్యమ పితామహుడు, టీచర్స్ మాజీ ఎమ్మెల్సీ ఎం.జే.మాణిక్యరావు శత జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ జె.గంగాధరరావు, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.వి.కృష్ణారావు, డాక్టర్ జి.ఆర్.కె.రెడ్డి, ఫైనాన్స్ సెక్రటరీ నరసయ్య, సలహాదారులు లక్ష్మీపతి, ఆర్.వెంకటేశ్వరరెడ్డి, లీగల్ కన్వీనర్ రమణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాని యేల్, మాజీ అధ్యక్షుడు రామ కృష్ణారెడ్డి, సంఘ ఏలూరు యూనిట్ అధ్యక్షుడు షేక్ హుస్సేన్, కోశాధికారి పి.ఆంజనేయులు, వీర భద్రరావు, బ్రహ్మేశ్వరి,ఉత్తమ దుర్గ, రాంబాబు, వివిధ కళాశాలల ప్రిన్సి పాల్స్, వివిధ జిల్లాల నుంచి సంఘ నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లపై అపోహలొద్దు

బిల్లుకు అదనంగా ఎటువంటి చార్జీలు ఉండవు

ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్



ఏలూరుసిటీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపుపై ఎటువంటి అపోహలు అవసరం లేదని, వీటి వల్ల ఎలాంటి అదనపు చార్జీల భారం ఉండదని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృధ్వీతేజ్ స్పష్టం చేశారు. స్మార్ట్ మీటర్లు బిగింపు ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడిస్తూ ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ వినియోగదారుల సేవలలో పారదర్శకతను మరింత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్‌డీఎస్ఎస్ పథకంలో భాగంగా అన్ని రాష్ట్రాల్లో స్మార్ట్ మీటర్లు ఏర్పాటును ప్రారంభించిందని అందుకు అనుగుణంగా ప్రస్తుత మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు 2021 ఫిబ్రవరిలో ఏపీఈఆర్‌సీ ఆమోదం తెలిపిందన్నారు. ఏపీఈఆర్‌సీ రెగ్యులేషన్ 2021 ప్రకారం ప్రభుత్వ, వాణిజ్య కేటగిరీల వినియోగదారులకు వీటిని బిగిస్తున్నామని చెప్పారు. వీటితో పాటు ఎక్కువ విద్యుత్ వినియోగం కలిగిన (హై వేల్యూ) గృహ వినియోగదారులకు కూడా బిగిస్తున్నామని తెలిపారు. స్మార్ట్ మీటర్ ఏర్పాటు సమయంలో వినియోగ దారులు వాటి ఖరీదు కాని , చార్జీలు కాని, మమూళ్ళు గాని చెల్లించనవసరం లేదన్నారు. స్మార్ట్ మీటర్ కన్స్యూమర్ యాప్ ద్వారా 24 గంటలూ కనెక్ట్ అయి ఉంటాయని, ఫలితంగా వినియోగదారులు తమ వినియోగాన్ని ఎప్పటికప్పుడు తెలుసు కోవచ్చునని చెప్పారు. పైగా అధిక వినియోగాన్ని నియంత్రించుకొంటూ విద్యుత్ బిల్లులను తగ్గించుకునేందుకు సహక రిస్తాయన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) నిర్ణయించిన టారీఫ్ ప్రకారమే విద్యుత్ బిల్లులు వసూలు చేస్తామన్నారు. బిల్లు వివరాలను నేరుగా వినియో గదారులు స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు సంబంధించిన సందేహాల నివృత్తి కోసం వినియోగదారులు టోల్‌ఫ్రీ నెంబరు 11912లో సంప్రదించవచ్చునని పృధ్వీతేజ్ తెలిపారు.

పుట్టినరోజు విషెస్ చెప్పలేదని టీచర్ ఆత్మహత్య

భార్య మృతి తట్టుకోలేక భర్త ఆత్మహత్యాయత్నం



దేవిక, సురేంద్ర దంపతులు(ఫైల్ ఫొటో)



ఆత్మహత్య చేసుకున్న టీచర్ దేవిక.. తీవ్రగాయాల పాలైన సురేంద్ర

ఏలూరు క్రైం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): భర్త పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలపలేదనే మన స్థాపంతో భార్య ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఏలూరు శివారు చొదిమెళ్లలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ముందాడ దేవిక (38), చిన్ని సురేంద్ర ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. వీరికి ఇంటర్, టెన్త్ చదువుతున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. విజయవాడ హాస్టల్లో ఉంటున్నారు. దేవిక ఉంగుటూరు మండలం నల్లమాడులో పనిచేస్తుండగా సురేంద్ర అదే మండలం రాచూరులోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఈనెల 19న దేవిక పుట్టిన రోజు.. ఆమె యథావిధిగా పాఠశాలకు వెళ్లిపోయింది. సురేంద్ర కూడా విధులకు వెళ్లారు. తిరిగి రాత్రికి ఇంటికి చేరుకున్నారు. ఇల్లు గడియ పెట్టి ఉండటంతో సురేంద్ర తలుపులు తీసి చూడగా దేవిక ఉరి వేసుకుని ఫ్యానుకు వేలాడుతూ కన్పించింది. భార్య మృతిని జీర్ణించుకోలేని సురేంద్రబాబు చేతులను, కాళ్లను బ్లేడుతో కోసుకుని రక్తంతో భార్య నుదిటిపై తిలకం దిద్దాడు. ఆ తరువాత గోడపై రక్తంతో ఐ లవ్‌యూ దేవిక అని రాశాడు. జాగ్రత్తగా ఉండాలని, బాగా చదువుకోవాలంటూ గోడపై రాశాడు. శనివారం రాత్రి బాగా పొద్దుపోయాక గుర్తించిన స్థానికులు ఆయన్ను ఆసుపత్రిలో చేర్చి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో విషయం తెలుసుకున్న దేవిక తల్లిదండ్రులు, బంధువులు ఆసుపత్రికి చేరుకున్నారు. ప్రస్తుతం సురేంద్ర చికిత్స పొందుతున్నాడు. ఉద్యోగ సంఘాల నాయకులు పలువురు ఆదివారం ఆసుపత్రికి చేరుకుని పరామ ర్శించారు. ఇద్దరూ ఆదర్శదంపతులని, ఎలాంటి గొడవలూ లేవని ఇలా చేసుకోవడం ఆశ్చ ర్యంగా ఉందని చెబుతున్నారు. ఈ కేసును పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. సీఐ సత్యనారాయణ, రూరల్ ఎస్.ఐ. దుర్గా ప్రసాద్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న సురేంద్ర వద్ద ఘటనకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేయలేదని భర్తపై అలిగి ఈ అఘాయిత్యానికి పాల్పడినట్టు ప్రాథమికంగా తెలిసిందన్నారు. ఇంకా ఏమైనా బలమైన కారణాలున్నాయా అనే దానిపై విచారణ చేస్తామన్నారు. ఇదిలా ఉండగా తమ కుమార్తె మృతిపై అనుమానాలున్నాయని దేవిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ధన్వంతరి స్వామికి అభిషేకాలు

ఏలూరుకార్పొరేషన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): పవరుపేట స్టేషన్ రోడ్డులోని ధన్వంతరి వైద్య భగవానుడి ఆలయం వద్ద ఆదివారం అమ్మవారికి సామూహికంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సూర్య నమస్కారాలు జరిపారు. ఆలయ అర్చకులు రాళ్ళబండి ఆదినారాయణ శర్మ భక్తులతో అర్చనలు జరిపించారు. భక్తులకు రక్షాబంధనాలు కట్టారు. భక్తులు ఆలయ ప్రదక్షిణలు నిర్వహించి స్వామివారి సన్నిధిలో భజనలు నిర్వహించారు. ఈ మేరకు ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది.

నాగదేవతకు ఘనంగా కావిడి ఉత్సవం

ఏలూరుకార్పొరేషన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): స్థానిక పోస్టల్ కాలనీలోని నాగదేవత ఆలయం వద్ద ఆదివారం కావిడి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి భక్తులు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఊటుకూరి సాయిబాబా శర్మ భక్తులతో వారి గోత్రనామాలతో అర్చనలు జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుని పుట్ట వద్ద పాలుపోసి పసుపు, కుంకుమతో ఆరాధించారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

మానవత సేవలు స్ఫూర్తిదాయకం

ఏలూరురూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): మానవత ఏలూరు యూనిట్ నెలవారీ సమీక్షా సమావేశం స్థానిక రామకృష్ణాపురం సాహిత్య మండలి ప్రాంగణంలో ఆదివారం మానవత అధ్యక్షుడు ఎంఎస్ఎం ఎస్.కుమార్ అధ్యక్షతన జరిగింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత సేవలు ప్రశంసనీయమన్నారు. మానవత సంస్థ ద్వారా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇద్దరు పేద కళాకారులకు రూ.5000చొప్పున నగదు పురస్కారాలను, చాటపర్రు రోడ్‌లో ఉన్న అంధుల పాఠశాల విద్యార్థులకు రూ.5000 విలువైన వస్తువులు అందజేశారు. కేంద్ర నియంత్రణ కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు దేవినేని భాస్కరరావు, మండల చైర్‌పర్సన్ అడుసుమిల్లి నిర్మల, జిల్లా కార్యదర్శి పోలవరపు దేవరత్నాకరరావు, ఆడిటింగ్ డైరెక్టర్ కడియాల కృష్ణారావు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో శక్తియాప్‌పై అవగాహన

ఏలూరు క్రైం, జూలై 20(ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన శక్తి యాప్ ప్రయోజనాలపై పోలీసులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ఏలూరులో ఆదివారం సాయంత్రం పలు బాలికల వసతి గృహాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుబ్బారావు, టూటౌన్ సీఐ అశోక్, కుమార్, త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, పలువురు ఎస్.ఐలు, సిబ్బంది ఆయా వసతి గృహాల్లో విద్యార్థినులకు శక్తి యాప్ ప్రయోజనాలను వివరించారు. మహిళల భద్రతకు సంబంధించిన అంశాలు, టెక్నాలజీ వినియోగం, అత్యవసర సమయాల్లో ఎలా అప్రమత్తంగా ఉండాలనే అంశంపై అవగాహన కల్పించారు.



వెలగపాడు టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

టి.నర్సాపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి):వెలగపాడు టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైనట్టు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు తెలిపారు. వీరభద్రవరంలోని ఆయన నివాసం వద్ద మండల పరిశీలకుడు గుత్తా వెంకటేశ్వరరావు సమక్షంలో ఆదివారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ కమిటీ ఏకగ్రీవమవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో నూతన కమిటీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా జోనుబోయిన వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా గుడిదెల కృపావరం, ప్రధాన కార్యదర్శి బొడ్డు నాగరాజు, కోశాధికారి ప్రభాకర్‌లతో పాటు నూతన కమిటీని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అత్తులూరి సర్వేశ్వరరావుకు సీపీఐ సంతాపం

ఏలూరు కార్పొరేషన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యేగా, వార్డు కౌన్సిలర్‌గా నగర అభివృద్ధికి విశేష కృషి చేసిన సీపీఐ నాయకులు అత్తులూరి సర్వేశ్వరరావు ఆశయాలను, ఆదర్శాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సీపీఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. వైఎంహెచ్‌ఏ హాలు సెంటర్‌లోని అత్తులూరి సర్వేశ్వరరావు స్మారక స్థూపం వద్ద ఆదివారం 43వ వర్థంతిని ఏలూరు పట్టణ పొగాకు పనివార్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘ అధ్యక్షులు బరగడ పోతురాజు అధ్యక్షత వహించారు. ఏఐటీయూసీ పతాకాన్ని ఏఐటీయూసీ ఏలూరు అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసడాంగే ఆవిష్కరించారు. సీపీఐ వాటి అనుబంధ సంఘాల ప్రతినిధులు, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడేన్ని వెంటాడుతున్న ఏఈల కొరత

▸▸ పట్టణాభివృద్ధికి ఆటంకం అంటూ పలువురి ఆవేదన

జంగారెడ్డిగూడెం, జూలై 20(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో ఏఈల కొరత వెంటాడుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఏ మాత్రం స్పందించడంలేదు. ఏడాదిగా ఏఈ లేకపోవడంతో పట్టణ అభివృద్ధి కుంటుపడుతోంది. గ్రేడ్-2 మున్సిపాలిటీకి ఇద్దరు ఏఈలు అవసరం, అయితే ప్రస్తుతం ఒక్కరు కూడా లేరు. దీంతో సచివాలయ ఒక ఉద్యోగిపై ఆధార పడాల్సి వస్తోంది.పట్టణ అభివృద్ధిలో కీలకమైన ఏఈ నియామకంలో ఉన్నతాధికారులు అలసత్వం వహించడాన్ని పలువురు ఖండిస్తున్నారు. పట్టణంలో నిర్మించే రోడ్లు, సీసీ డ్రైన్లు, మంచి నీటి పైప్ లైన్లు, వీధి దీపాలు ఇలా ప్రతీ పనిలో ఏఈ అవసరం ఎంతో ఉంది. రెగ్యులర్ ఏఈ లేకపోవడంతో జరగాల్సిన పనులు చాలా ఆలస్యంగా జరుగుతున్నాయి. పట్టణంలో చేయాల్సిన అభివృద్ధి పనులకు అంచనాలు వేయడంలోను, త్వరగా నిర్ణయాలు తీసుకోవడంలోనూ, టెక్నికల్ సమస్యలను అధిగమించడంలోనూ, కాంట్రాక్టర్లు చేసిన పనులకు సంబంధించిన బిల్లులను సరైన సమయంలో సీఎఫ్ఎంఎస్‌లోకి ఎక్కించడానికి రూ.కోట్లతో చేసే అభివృద్ధి పనుల నాణ్యత పరి శీలించడానికి ఏఈ అవసరం ఎంతో ఉంది. దీనిపై మున్సిపల్ కమిషనర్ కె.వి. రమణను వివరణ కోరగా జూలై 10న అమలాపురం మున్సిపాలిటీలో ఏఈగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్ ను జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీకి బదిలీ చేసినట్లు ఆర్డర్ కాపీ వచ్చింది. కానీ ఇప్పటి వరకూ విధుల్లో చేరలేదని, అమలాపురంలో రిలీవ్ కాలేదని తెలిపారు.

ఉత్సాహంగా జనసేన ఆత్మీయ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న బాబ్జీ

జంగారెడ్డిగూడెం, జూలై 20(ఆంధ్రజ్యోతి):పంచాయతీ రాజ్ వ్యవస్థలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీసుకొస్తున్న మార్పులకు ఆకర్షితుడినై జనసేన పార్టీలో ఇటీవల అమరావతిలో చేరినట్టు జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ తెలిపారు. ఆలపాటి గంగాభవానీ కల్యాణ మండపంలో ఆదివారం జనసేన ఆత్మీయ సమావేశం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ జనసేన కుటుంబంలోకి తనను ఆహ్వానించడం సంతోషంగా ఉందన్నారు. మాజీ డీసీసీబీ చైర్మన్ కరాటం రాంబాబు కుటుంబం నుంచే రాజకీయం నేర్చుకున్నానన్నారు. ఉత్తమ సర్పంచ్‌గా అవార్డులు అందుకున్నట్టు గుర్తు చేశారు. మాజీ డీసీసీబీ చైర్మన్ కరాటం రాంబాబు,పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు అమలు చేయాలి

జంగారెడ్డిగూడెం, జూలై 20(ఆంధ్రజ్యోతి): కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం కేతవరంలో సీలింగ్ భూములను పరిశీలించారు. పేదలకు కేటాయించిన సీలింగ్ భూముల్లో దుక్కిదున్ని సాగు చేయడానికి పట్టాదారులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ మండల కార్యదర్శి జేవీ రమణరాజు, సహాయ కార్యదర్శి సుంకర రాధాకృష్ణ, గొలిమే బాలయేసు, కూరాకుల బాబూరావు, యడ్లపల్లి రమేష్, మంచెల్ల ప్రభాకర్, అంకాలయ్య పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా చెస్ పోటీలు

జంగారెడ్డిగూడెం, జూలై 20(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ చెస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం రోటరీ కమ్యూనిటీ హాల్లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చెస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 68 మంది బాల బాలికలకు సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. రోటరీ సీనియర్ సభ్యులు మల్లాది సీతారామారావు, చామర్తి శ్రీరాములు, పాలపర్తి శ్రీనివాస్, దాకారపు కృష్ణ, రామ తారకం, రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు పెనుమర్తి సురేష్, సంధ్య ప్రవల్లిక, ఊడా రాంగోపాల్, చెస్ మాస్టర్ అయినపర్తి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కూటమితోనే సుపరిపాలన

ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసిన నాయకులు



మహిళ సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరుటూటౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): తమకు సంక్షేమ ఫలాలు అందడం లేదని ప్రశ్నించిన ప్రజలను గతంలో వైసీపీ ప్రభుత్వం నిర్బంధాలకు గురి చేసిందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా 41వ డివిజన్‌లో పర్యటించారు.ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజల్లో స్వేచ్ఛాయుత వాతావరణం ఏర్పడిందన్నారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తుందన్నారు. అర్హులంతా సంక్షేమ పథకాలను తీసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. వైసీపీ ప్రభుత్వం మహిళలను మోసం చేసి ఇళ్ల నిర్మాణాల పేరుతో రూ.35 వేలు కట్టించుకున్నారని ఆగ్రహ వ్యక్తం చేశారు. ఆ డబ్బును పది రోజుల్లో ఆయా మహిళల ఖాతాలకు జమ చేస్తామని హామీ ఇచ్చారు. డిసెంబర్ నాటికి టిడ్కో గృహాలు అందజేస్తామన్నారు. బొరోతు బాలాజీ, కార్పొరేటర్ ఈదుపల్లి పవన్ కల్యాణ్, డివిజన్ ఇన్‌చార్జ్ సంతోషి ప్రసాద్, వీ.శంకర్, ఎం.శంకర్, ఇడా చైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థసారధి, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, టీడీపీ నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, కొల్లేపల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం : మండలంలోని రవ్వారిగూడెంలో ఆదివారం టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సున్నం నాగేశ్వరావు సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంచుతూ తల్లికి వందనం, దీపం పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, యువత ఉద్యోగాలు, రైతు సంక్షేమం తదితర పథకాలను ప్రజలకు వివరించారు. కుంజా సంకురు, సున్నం గౌతమ్, పొడియం అర్జున్, షేక్ జాకీర్ పాల్గొన్నారు.



చింతలపూడిలో ప్రచారం నిర్వహిస్తున్న రోషన్

● చింతలపూడి: సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. ఆదివారం నగర పంచాయతీలోని వెలమపేటలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసే సూపర్-6 గురించి వివరిస్తూ స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. కొందరు రోడ్లు బాగోలేదని, గోతులు పూడ్చి రోడ్లు వేయాలని కోరారు. ప్రచారంలో కూటమి నాయకులు తాటి అప్పారావు, మాజీ సర్పంచ్ చిట్లూరి ధర్మరాజు, కొత్తపూడి శేషగిరి, మన్యం సత్తిబాబు పాల్గొన్నారు.

జనసేన కమిటీల నియామకం

ఏలూరు రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరంలోని 3, 20వ డివిజన్‌లకు జనసేన పార్టీ నూతన కమిటీలను నియమించారు. ఆదివారం ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు వివరాలు తెలిపారు. 3వ డివిజన్ ఇన్‌చార్జిగా కొనసం ప్రమీల, అధ్యక్షుడిగా నడిపూడి ఈశ్వర్‌రావు, 20వ డివిజన్‌కు మల్లె మొగ్గల బాలాజీ అధ్యక్షుడిగా, తోట కిషోర్ ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈసందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ విజయాన్ని లక్ష్యంగా చేసుకుని కార్యచరణపై చర్చించారు. జనసేన పార్టీకి కార్యకర్తలే బలమన్నారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా అన్ని డివిజన్లలో కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

'స్మార్ట్ విద్యుత్ మీటర్లు వద్దు'

బుట్టాయగూడెం, జూలై 20(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ విద్యుత్ మీటర్లు వద్దంటూ ప్రజలంతా మీటర్ల బిగింపును వ్యతిరేకించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి పిలుపునిచ్చారు.ఈ మేరకు గోడప్రతులను ఆదివారం బుట్టాయగూడెం మండల కమిటీ ఆధ్వర్యంలో విడుదల చేశారు. నాగమణి మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్ భారం మోపాలను చూడటం సిగ్గుచేటన్నారు. నాయకులు తామా ముత్యాలమ్మ, తెల్లం రామకృష్ణ, కోర్స జలపాలు, పోలోజు నాగేశ్వరావు, పూనెం శేఖర్, చుంద్రు బుల్లెమ్మ, తెల్లం వెంకటలక్ష్మీ, వెట్టి వీరయ్య, మడకం శ్రీదేవి పాల్గొన్నారు.



దర్భగూడెంలో సారె తీసుకెళ్తున్న మహిళలు



తడికలపూడిలో సారె సమర్పించిన భక్తులు



చల్లచింతలపూడిలో సారె తీసుకెళ్తున్న భక్తులు

ఘనంగా అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పణ

సందడిగా మారిన ఆలయాలు

దెందులూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): చల్లచింతలపూడి ఊర చెరువు వద్ద ఉన్న గ్రామ దేవత గంగానన్నమ్మకు టీడీపీ గ్రామాధ్యక్షుడు వేమన రాముగౌడ్ సుజాత దంపతులు పూజలు నిర్వహించారు. రాము గౌడ్ ఇంటి నుంచి సంప్రదాయ బద్ధంగా రకరకాల పిండి వంటలతో గంగనమ్మకు ఆషాఢ సారేను అందజేశారు.

● ఏలూరుకార్పొరేషన్: కొత్తపేటలోని గ్రామదేవత నూకాలమ్మకు ఆషాఢంలోని ఆఖరి ఆదివారం కావడంతో విశేష పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు ఆషాడ సారెను సమర్పించారు. ఈ మేరకు ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది.

● కామవరపుకోట : తడికలపూడిలోని గ్రామదేవత ఆలయంలో కొలువైన అంకాలమ్మ, గంగానమ్మ, మహాలక్ష్మీ అమ్మవార్లకు ఆదివారం ఆషాఢ మాసంలోని ఆఖరి ఆదివారం సందర్భంగా ఆషాఢ సారెను సమర్పించారు. గంగా పార్వతీ సమేత గాంగేశ్వరస్వామి ఆలయం నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా తడికలపూడి పోలీస్ స్టేషన్ సమీపంలోని గంగానమ్మ ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు. పాతూరులోని గుడ్లగవరమ్మ ఆలయం వద్ద భక్తులు ఆదివారం మేళతాళాలతో ఊరేగింపుగా వాయుసుగ్రీవుల గట్టు సమీపంలోని గుడ్లగవరమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించారు. పాతూరు, మద్దుకూరు, వడ్లపల్లి తదితర గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చారు.

● చింతలపూడి: ఆషాఢ మాసం సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీమాతకు సారె ఆదివారం సమర్పించారు. ఉదయం పాతబస్టాండ్‌లోని అభయాంజనేయస్వామి ఆలయం నుంచి కోదండ రామాలయానికి తరలివెళ్లి ఏర్పాటు చేసిన వాసవీ మాత విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. పట్టణంలోని ఆర్యవైశ్య మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సంఘ నాయకులు వజ్రపు శేఖర్, సి.హెచ్.అబ్బయ్య, జల్లిపల్లి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: దర్భగూడెం గ్రామ ఇలవేల్పు భూలక్ష్మీ దేవిని శాకంబరిగా అలంకరించారు. ఆదివారం ఆషాఢ సారెను గ్రామ మహిళలు అమ్మవారికి సమర్పించారు. ఆలయంలో అమ్మవారిని అర్చకులు జటావల్లభుల మూర్తిశర్మ సహస్ర కుంకుమార్చనలు చేశారు. సామూహిక పూజల్లో మహిళలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కేతిరెడ్డి రాఘవరెడ్డి, ముప్పిడి సురేష్ రెడ్డి, అలవాల పెద్దబ్బులు, కంచర్ల పాండురంగారావు, వేదుల జనార్ధన్ ఉన్నారు.

మానవత కార్యాలయం ప్రారంభం

చింతలపూడి, జూలై 20(ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సేవా కార్యాలయాన్ని ఆదివారం ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ప్రారంభించారు. మావనత సంస్థలో తనను సభ్యుడిగా చేసినందుకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. మానవత వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.రామచంద్రారెడ్డి, జిల్లా నాయకులు ఆలపాటి నాగేశ్వరరావు, దేవినేని భాస్కరరావు, ఆర్నేపల్లి అప్పారావు, డాక్టర్ ఎ.సత్యనారాయణ పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఐఎస్ రాఘవాపురంలో జరుగుతున్న కోడిపందేల స్థావరంపై ద్వారకాతిరుమల పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో 15 మందిని అదుపులోకి తీసుకుని వారినుంచి పది బైక్స్, నాలుగు కోడి పుంజులు, రూ.20,670 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ సుధీర్ తెలిపారు.

నకిలీ రసీదులపై చర్యలు తీసుకోండి

పోలవరం, జూలై 20(ఆంధ్రజ్యోతి):గూటాల లక్ష్మీనరసింహస్వామి ఆలయం పేరిట కొందరు నకిలీ రసీదు పుస్తకాలు ముద్రించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్టు ఆలిండియా హేండ్లూమ్స్ బోర్డు మాజీ మెంబర్ చవల మహేశ్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ దేవస్థానం బోర్డు కమిటీ చైర్మన్ కమిటీ సభ్యులు కలిసి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయం పేరిట దేవదాయ శాఖ అనుమతులు లేకుండా దొంగ రశీదు బుక్కులు ముద్రించి సుమారు రెండుకోట్ల రూపాయలు చందాల రూపంలో దాతల నుంచి వసూలు చేసి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. దేవస్థానం ఖాతాలో సొమ్ములు స్వాహా చేశారన్నారు. ఈ విషయంపై దేవదాయ ధర్మదాయ శాఖకు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు విచారణ చేసి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సంక్షేమ పింఛన్లు ఇవ్వండి

లింగపాలెం, జూలై 20(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో సంక్షేమ, వృద్ధాప్య డప్పు కళాకారుల పింఛన్లను వెంటనే విడుదల చెయ్యాలని దళితసేన అధ్యక్షుడు రవి ప్రకాశ్ డిమాండ్ చేశారు. లింగపాలెంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ, వృద్ధాప్య, డప్పు కళాకారుల, చెప్పులు కుట్టే వారికి పింఛన్‌లు వెంటనే మంజూరు చెయ్యాలని అందుకు సీఎం చంద్రబాబు ఆదేశాలివ్వాలన్నారు. [illegible], కొప్పుల నాగేంద్ర, మోహనరి కార్తిక్ పాల్గొన్నారు.

నెరవేరని ఈ-వ్యర్థాల సేకరణ లక్ష్యం

నగదు చెల్లించి కొనుగోలు చేస్తున్న ప్రైవేటు వ్యక్తులు - ఉచితంగా ఎవరిస్తారంటూ పలువురు ఆశ్చర్యం



లింగపాలెం, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్, ఈ-వ్యర్థాల వల్ల మనుషులకు చాలా ప్రమాదం పొంచి ఉంది. ఎలక్ట్రానిక్, ఈ-వ్యర్థాలను సేకరించి ఆర్ఆర్ఆర్(రెడ్యూస్, రీయూజ్, రీసైక్లింగ్) కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా సంపద సృష్టిస్తామని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. అయితే ముందస్తు ప్రణాళిక లేకుండా చేపట్టిన ఈ పథకం ఆదిలోనే అటకెక్కింది. గత మార్చిలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో భాగంగా ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి హానికరమైన ఈ వ్యర్థాలను సేకరించి ఆర్ఆర్ఆర్ కేంద్రాల ద్వారా రీసైక్లింగ్ చేసి పంచాయతీలకు ఆదాయం సమకూర్చవచ్చని ప్రభుత్వం తలంచింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ-వ్యర్థాల సేకరణను ప్రారంభించింది. కాని అధికారులు ఈ కార్యక్రమాన్ని ఆ ఒక్క రోజుకే పరిమితం చెయ్యడంతో ఈ పథకం ఉదేశం నీరుకారి పోయింది. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించకముందే కొందరు వ్యాపారులు గ్రామాల్లో మోటార్ సైకిళ్లు, ఆటోల ద్వారా నగదు, కూరగాయలు, స్టీల్ సామాన్లను అమ్మడం ద్వారా వ్యర్థాలను సేకరించి రీసైక్లింగ్ పరిశ్రమలకు విక్రయిస్తూ లక్షలాది రూపాయలను సంపాదించుకుంటున్నారు. అయితే ఈ-వ్యర్థాలను రీసైక్లింగ్ ద్వారా సేకరించే వ్యాపారులు ఇళ్ల వద్దకు వచ్చి నగదు చెల్లించి కొనుగోలు చేస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా ఈ-వ్యర్థాలను ఉచితంగా సేకరించాలని నిర్ణయం తీసుకుంది.ఈ-వ్యర్థాలను ఉచితంగా ఎవరిస్తారనే ఆలోచన అధికారులకు రాకపోవడం ఆశ్చర్యకరం. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ-వ్యర్థాలకు ధర చెల్లించి కొనుగోలు చేసేలా మార్పులు చేస్తే ఈ పథకం ఆచరణలోకి రావచ్చని పరిశీలకులు చెబుతున్నారు.



బహుమతులు అందుకున్న విజేతలు

ఉత్సాహంగా చదరంగం పోటీలు

ఏలూరు రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): పడమరవీధిలోని విజ్ఞాన విహార స్కూల్ ప్రాంగణంలో ఆదివారం ఏలూరు జిల్లా చెస్ అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో అండర్-13 ఓపెన్, బాలబాలికల ఛాంపియన్‌షిప్, సీనియర్ ఉమెన్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. టోర్నమెంట్ డైరెక్టర్ లక్కోజు అనిల్ ఆచార్య ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో అండర్-13 విభాగంలో జి.అభిషేక్ ప్రథమ, ఎడ్ల జ్యోతి స్వరూప్ ద్వితీయ స్థానం, సీనియర్ మహిళల విభాగంలో యడ్ల ప్రేమిరక్షిత ప్రథమం, రాజ్యలక్ష్మి ఆలూరు ద్వితీయ, తెజస్విని ఆలూరు తృతీయ స్థానాలు సాధించారు. విజేతలు ఈనెల 26, 27 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో పాల్గొంటారని అడ్‌హక్ కమిటీ కన్వీనర్ వేల్పూరి వాసుదేవరావు తెలిపారు. అలాగే అండర్ 13 బాల, బాలికల విభాగంలో గెలుపొందిన విజేతలు ఆగస్టు 12న జరిగే రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో ఏలూరు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని వాసుదేవరావు తెలిపారు.

సారా బట్టీపై దాడి

చింతలపూడి, జూలై 20(ఆంధ్రజ్యోతి): కొమ్ముగూడెంలో పామాయిల్ తోటలో సారా తయారు చేస్తున్న బట్టీపై పోలీసులు దాడులు నిర్వహించారు. బాణావత్ విష్ణు, దారావత్ పవన్‌లను అదుపులోకి తీసుకుని వారి నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 700 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి గ్యాస్ స్టవ్, సిలిండర్, అల్యూమినియం పాత్రలు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

బస్సు ఢీకొని వృద్ధురాలికి గాయాలు

చింతలపూడి, జూలై 20(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తబస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు ఢీకొని చాట్రాయి గ్రామానికి చెందిన తుమ్మల లక్ష్మీ అనే వృద్ధురాలికి తీవ్రగాయాలయ్యాయి. కాలు నుజ్జునుజ్జు కావడంతో చింతలపూడి ఏరియా ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్సకు విజయవాడ తరలించారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

గోవా గవర్నర్ అశోక్ గజపతికి టీడీపీ నేతల శుభాకాంక్షలు

ద్వారకాతిరుమల, జూలై 20(ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్‌గా నియమితులైన పూసపాటి అశోక్ గజపతి రాజును టీడీపీ స్థానిక నేతలు కలిసి ద్వారకాతిరుమల శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. విజయనగరంలో ఆయన బంగ్లాకు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుతో కలిసి వెళ్లి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా స్వామివారి కండువాను కప్పి, పుష్పగుచ్ఛాలను, ప్రసాదాలను అందజేశారు. గోపాలపురం ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మారాజు, మండలాధ్యక్షుడు లంకా సత్తిపండు, నేతలు పాతూరి సహృదయ్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



కళాకారులను సన్మానిస్తున్న దృశ్యం

ఉత్సాహంగా శాస్త్రీయ భక్తిగీతాలాపన

ఏలూరు రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): నిరంతరం సంగీత కళాకారులను ప్రోత్సహిస్తూ సంప్రదాయ సంగీతాన్ని పుల్లాబొట్ల పురుషోత్తమరావు అన్నారు. రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి కళావేదికపై ఆదివారం సాయంత్రం వాగ్గేయ సంగీత కళాకారులచే రచించిన శాస్త్రీయ భక్తిగీతాలను, సంకీర్తనలను ఆలపించారు. గరికపాటి ఆర్ట్స్ థియేటర్ 276 కార్యక్రమంలో భాగంగా వీణపాటి ఎ.విజయలక్ష్మీ శిష్య బృందంచే శాస్త్రీయ భక్తిగీతాల ఆలాపన కార్యక్రమాన్ని పుల్లాలబోట్ల పురుషోత్తమరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎం.స్వరూప, పి సాయి శివాని, ఎస్.విజయలక్ష్మి, ఎండీఎస్ మీనాక్షి, శ్రవణానందకరంగా ఆలపించారు.



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కళకళలాడిన శ్రీవారి ఆలయం

ద్వారకాతిరుమల, జూలై 20(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమలేశుని ఆలయం ఆదివారం భక్తులతో కళకళలాడింది. సెలవురోజు కావడంతో ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వీరంతా భక్తిప్రపత్తులతో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. యాత్రికుల రాకతో లడ్డూ, ప్రసాదాల కౌంటర్లు, దర్శనం క్యూలైన్లు, అనివేటి మండప ప్రాంతం, కేశ ఖండన శాల విభాగాలు కిటకిటలాడాయి. దాదాపు 12వేల మందికి పైబడి యాత్రికులు స్వామి, అమ్మవార్లను దర్శించినట్టు ఆలయ వర్గాలు భావిస్తున్నాయి.



వైద్య శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న చింతమనేని

ఉచిత వైద్య సేవలు

దెందులూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): చింతమనేని ట్రస్టుతో పాటు ఆదిత్య కమర్షియల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సుగర్ బాధితులకు ఉచితంగా ఇన్సులిన్, మందులను అందిస్తున్నట్టు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు. దెందులూరులోని టీటీడీ కల్యాణ మండపంలో ప్రారంభించిన ఈ శిబిరంలో రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనరేట్ ప్రభుత్వ వైద్య అధికారి డాక్టర్ జి మల్లేశ్వరమ్మలతో కలిసి ఆదివారం 80 మందికి రూ.5 లక్షల విలువైన మందులు పంపిణీ చేశారు. ఆదిత్య కమర్షియల్స్ లిమిటెడ్ చైర్మన్ వంకినేని భానుప్రకాశ్, నోవా నార్డిస్క్ కంపెనీ డైరెక్టర్ సందీప్‌రెడ్డి మాట్లాడుతూ డయాబెటిస్ విభాగం ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతినిస్తే ఆర్థిక సాయం అందిస్తామన్నారు. డయాబెటిస్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ పాతూరి విష్ణుప్రియరావు పాల్గొని తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

153 మందికి నేత్ర పరీక్షలు

ఏలూరుకార్పొరేషన్: స్థానిక అగ్రహారంలోని రామకోటి ప్రాంగణంలో లయన్స్ క్లబ్ నాయకులు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల బృందం 153 మందికి ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించి 21 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. ఉషా అధినేత వి.వి.బాలకృష్ణారావు సహకారంతో ఈ నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించినట్టు లయన్స్ నాయకులు తెలియజేశారు. శిబిరంలో బొలిశెట్టి సురేష్ కుమార్, తవ్వా మణికంఠ, కేశవ్ బృందం సేవలు అందించారు.

23 వరకు అన్నదాత సుఖీభవ గ్రీవెన్స్ నమోదు

ముసునూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో ఉంచిన అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారుల జాబితాలో పేరు లేకపోతే ఈ నెల 23లోగా అర్హులైన రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద గ్రీవెన్స్‌లో వివరాలను నమోదు చేసుకోవాలి. ఈ మేరకు మండల వ్యవసాయ అధికారి చాముండేశ్వరి రైతులకు సూచించారు.

గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజు నియామకంపై హర్షం

నూజివీడు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్‌గా నియమితులు కావడం పట్ల నూజివీడు పట్టణంలోని కొప్పుల వెలమపేట వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన అభిమానులు స్వీట్లు పంపిణీ చేశారు. పూర్వీకుల నుంచి వచ్చిన వేలాది ఎకరాలను పేదలకు పంచిన మహోన్నత వ్యక్తి అశోక్ గజపతిరాజు అని పలువురు ప్రశంసించారు.

పుట్టినరోజు విషెస్ చెప్పలేదని భార్య ఆత్మహత్య

తట్టుకోలేక భర్త ఆత్మహత్యాయత్నం


దేవిక, సురేంద్ర (ఫైల్)

ఏలూరు క్రైం, జూలై 20(ఆంధ్రజ్యోతి): భర్త పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పలేదనే మనస్థాపంతో భార్య ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. జిల్లా కేంద్రం ఏలూరు శివారు చొదిమెళ్లలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ముందాడ దేవిక(38), చిన్ని సురేంద్ర ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. వీరికి ఇంటర్, టెన్త్ చదువుతున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. విజయవాడ హాస్టల్లో ఉంటున్నారు. దేవిక ఉంగుటూరు మండలం నల్లమాడులో పనిచేస్తుండగా సురేంద్ర అదే మండలం రాచూరులోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 19న దేవిక పుట్టిన రోజు.. ఆమె యథావిధిగా పాఠశాలకు వెళ్లిపోయింది. సురేంద్ర కూడా విధులకు వెళ్లారు. తిరిగి రాత్రికి ఇంటికి చేరుకున్నారు. ఇల్లు గడియ పెట్టి ఉండటంతో సురేంద్ర తలుపులు తీసి చూడగా దేవిక ఫ్యానుకు ఉరి వేసుకుని వేలాడుతూ కన్పించింది. భార్య మృతిని జీర్ణించుకోలేని సురేంద్రబాబు చేతులను, కాళ్లను బ్లేడుతో కోసుకుని రక్తంతో భార్య నుదుటిపై తిలకం దిద్దాడు. ఆ తరువాత గోడపై రక్తంతో ఐ లవ్ యూ దేవిక అని రాశాడు. జాగ్రత్తగా ఉండాలని, బాగా చదువుకోవాలంటూ గోడపై రాశాడు. శనివారం రాత్రి బాగా పొద్దుపోయాక గుర్తించిన స్థానికులు ఆయన్ను ఆసుపత్రిలో చేర్చి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో విషయం తెలుసుకున్న దేవిక తల్లిదండ్రులు, బంధువులు ఆసుపత్రికి చేరుకున్నారు. ప్రస్తుతం సురేంద్ర చికిత్స పొందుతున్నాడు. ఉద్యోగ సంఘాల నాయకులు పలువురు ఆదివారం ఆసుపత్రికి చేరుకుని పరామర్శించారు. ఇద్దరూ ఆదర్శ దంపతులని, ఎలాంటి గొడవలు లేవని, ఇలా చేసుకోవడం ఆశ్చర్యంగా ఉందని చెబుతున్నారు. ఈ కేసును పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. సీఐ సత్యనారాయణ, రూరల్ ఎస్.ఐ. దుర్గాప్రసాద్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సురేంద్ర వద్ద ఘటనకు దారి తీసిన పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేయలేదని భర్తపై అలిగి ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు ప్రాథమికంగా తెలిసిందన్నారు. ఇంకా ఏమైనా బలమైన కారణాలున్నాయా అనే దానిపై విచారణ చేస్తామన్నారు. ఇదిలా ఉండగా తమ కుమార్తె మృతిపై అనుమానాలున్నాయని దేవిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రిగారూ! పట్టించుకోరూ..

అధ్వానంగా నూజివీడు-ఏలూరు ప్రధాన రహదారి

నరకం చూస్తున్న ప్రయాణికులు


నూజివీడు బాబా గుడి వద్ద కోతకు గురైన రహదారి

నూజివీడు-ఏలూరు ప్రధాన రహదారిపై ప్రయాణం నరకం. అడుగడుగునా భారీ గుంతలు. ఒక గుంతను తప్పిస్తే మరొకటి సిద్ధం. ఈలోగా వాహనాలు మీదుకు దూసుకువస్తాయి. భయాందోళనలతో ఈ రహదారిపై ప్రజలు ప్రయాణం సాగిస్తున్నారు.

ముసునూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): నూజివీడు నుంచి సింహాద్రిపురం, ముసునూరు, గోపవరం, వేల్పుచర్ల మీదుగా ఏలూరు వెళ్ళే ఆర్అండ్‌బీ రహదారి అధ్వానంగా ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా గత వైసీపీ ప్రభుత్వం ఈ రహదారి అభివృద్ధిని పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా ఈ రహదారికి మోక్షం కలగలేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. పలు జిల్లాల్లో అధ్వానంగా ఉన్న రహదారులు సైతం అభివృద్ధి చెందాయని, మంత్రి నియోజకవర్గంలోని ఈ రహదారి మాత్రం అభివృద్ధికి నోచుకోలేదని ప్రజలు, వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నిధులు మంజూరై మూడేళ్లు!

నూజివీడు నుంచి ముసునూరు మండలం వేల్పుచర్ల వరకు 22 కిలోమీటర్లకు రూ. 47.18 కోట్లు నిధులు మంజూరై మూడేళ్ళు పూర్తయినా రహదారి అభివృద్ధి జాడలేదు. గత వైసీపీ ప్రభుత్వంలో కొంతమేర మార్జిన్‌ను తవ్వి కంకరపోసి, రోలింగ్ చేసిన పనులకు నిధులు ఇవ్వడం జరిగిందని, అయినా కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు వదిలివేసినట్లు అధికారులు చెబుతున్నారు. రహదారి అభివృద్ధి పేరట లక్షలు విలువ చేసే పెద్దపెద్ద వృక్షాలను సైతం నరికివేశారు.


సింహాద్రిపురం సెంటర్‌లో రహదారి దుస్థితి

మంత్రి దృష్టికి సమస్య...

రహదారి సమస్యను నూజివీడు ఎమ్మెల్యే, రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి దృష్టికి టీడీపీ నాయకులు, ప్రజలు పలుమార్లు తీసుకువెళ్ళారు. ముసునూరు మండలం వేల్పుచర్ల శివారు నుంచి ఏలూరు వరకు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకరావు ఆధ్వర్యంలో రోడ్డు వేశారని, ఇప్పటికైన వేల్పుచర్ల నుంచి నూజివీడు వరకు అధ్వానంగా ఉన్న రహదారి అభివృద్ధి పనులను తక్షణమే చేపట్టాలని మంత్రి పార్థసారధికి విజ్ఞప్తి చేస్తున్నారు.


గోపవరంలో రహదారిపై ఉన్న గుంతలు

పనులు ప్రారంభిస్తాం..

నిధులున్నా పనులు చేపట్టకపోవడానికి కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణం. ఇప్పటికే కాంట్రాక్టర్‌కు ఉన్నతాధికారులు నోటీసులు జారీ చేస్తున్నా స్పందన లేదు. ఈ విషయం మంత్రి పార్థసారధి దృష్టిలో ఉంది. ప్రస్తుతం నూతన టెండర్లకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. వీలైనంత త్వరలో పనులు ప్రారంభానికి చర్యలు తీసుకుంటాం.

-సీహెచ్.బాబురావు, ఆర్అండ్‌బీ డీఈ, నూజివీడు

రేపు విద్యుత్ సమస్యలపై ఫిర్యాదుల స్వీకారం

కైకలూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): కైకలూరు నియోజకవర్గ ప్రజల విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఈ నెల 22న హనుమాన్ జంక్షన్‌లో జరిగే కన్స్యూమర్ గ్రీవెన్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో జరిగే విద్యుత్ అవగాహన సదస్సు లో ఫిర్యాదు చేయవచ్చని గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. 22న ఉదయం 10.30 గంటల నుంచి హనుమాన్ జంక్షన్‌లోని ఎస్సార్ కన్వెన్షన్ హాలులో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. విజయవాడ కు చెందిన కన్స్యూమర్స్ ఫోరం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తారని ఇందులో కైకలూరు నియోజకవర్గానికి చెందిన విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను రాతపూర్వకంగా పూర్తి చిరునామాతో ఫిర్యాదు చేయవచ్చ న్నారు. విద్యుత్ అంతరాయాలు, హెచ్చుతగ్గులు, మీటర్, బిల్లులు, విద్యుత్ సరఫరాకు సంబంధించిన అన్ని సమస్యలను ఈ కార్యక్రమం ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమానికి ఉన్నతాధికారులు హాజరవుతారని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.


ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే కామినేని, రామచంద్రారెడ్డి

మానవత నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

కైకలూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన సమాజ నిర్మాణం కోసం మానవత కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కైకలూరు సీతారామ ఫంక్షన్ హాలులో ఉమ్మడి కృష్ణా జిల్లా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గాన్ని సంస్థ వ్యవ స్థాపకులు ఎస్. రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గౌరవ సలహాదారుల ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కామినేని ముఖ్యఅతిథిగా మాట్లాడు తూ సమాజానికి మానవత సంస్థతో పాటు ప్రజలు కూడా సేవ చేయాల న్నారు. ప్రకృతిని ప్రేమిస్తే ఆరోగ్యవంతమైన సమాజం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యాంజలి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఎస్. జమీల్ అహ్మద్ రచించిన మానవతా మేలుకో గేయాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా కైకలూరుకు చెందిన కొండ్రెడ్డి సత్యనారాయణ (పెదబాబు) ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, ఎంపీపీ అడవి కృష్ణ, మానవత సంస్థ సభ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి : ఏఎంసీ చైర్మన్ అరుణ


అరుణను సత్కరిస్తున్న కూటమి నాయకులు

చాట్రాయి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని నూజివీడు ఏఎంసీ చైర్మన్ కుంపటి అరుణ అన్నారు. మండలంలోని సూరంపాలెంలో వీరాంజనేయస్వా మికి పూజల అనంతరం బీజేపీ నాయకుడు బుర్రి శ్రీకర్ గృహంలో ఆమె కూటమి నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ నిరంతరం రైతులకు అందు బాటులో ఉంటానని, ఏఎంసీ నుంచి రైతులకు ఎంత మేరకు అవకాశం ఉంటే అంత మేలు చేయటానికి ప్రయత్నిస్తానని అన్నారు. అనంతరం చనుబండలో బీజేపీ నాయకుడు నెక్కలపు వెంకటేశ్వరరావు దంప తులు అరుణను సన్మానించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఓబిళ్ళనేని రాజా, నాయకులు పాల్గొన్నారు.

కృష్ణుడి ఆరాధనతో ప్రకృతి వైపరీత్యాలు దూరం


ఆధ్యాత్మిక గ్రంథాలతో ఊరేగింపు

ముసునూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని చిల్ల బోయినపల్లిలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక నూజివీడు కమిటీ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక గ్రంథాలతో ఆదివారం ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ దేవుడు అవతరించి ఒక మనిషిగా జన్మిస్తే ఆయనను భగవంతుడు అంటామని, అలాంటి భగవంతుడే శ్రీకృష్ణుడని అన్నారు. పూర్వం శ్రీకృష్ణాష్టమి 11 రోజులు పాటు నిర్వహించి, చివరిగా చవితిరోజున ఊరేగింపు నిర్వహించి ముగించేవారని తెలిపారు. స్వామివారిని ఊరేగించిన గ్రామంలో ప్రకృతి వైపరీత్యాలు, ప్రజలకు రోగాలు ఉండవ న్నారు. ప్రజలు శ్రీకృష్ణుడిని ఆరాధించాలని కోరారు. కమిటీ సభ్యులు కోటేశ్వరరావు, జాస్తి శివరామకృష్ణ, అశోక్, రామాంజనేయులు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	106, 114, 125
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210
నెక్ కోడి గుడ్డు ధర	(100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475


ఆగిరిపల్లిలో సుపరిపాలనలో పాల్గొన్న మంత్రి


పర్వతాపురంలో సుపరిపాలనలో తొలి అడుగు


పెదపుట్లపూడిలో కరపత్రాల పంపిణీ

కూటమితోనే సంక్షేమం, అభివృద్ధి

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పార్థసారథి

ఆగిరిపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతోందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆగిరిపల్లిలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరిస్తూ కరప త్రాలను పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకొని, వాటిని వెంటనే పరిష్కరించాలని నాయకులకు మంత్రి సూచించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో పరిశ్రమలు, పారిశ్రామికవే త్తలు మన రాష్ట్రానికి తరలివస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మండల టీడీపీ నాయకులు నెరుసు సతీష్, టీడీపీ మండల అధ్యక్షుడు నక్కనబోయిన వేణు, మండల టీడీపీ కోశాధికారి వై. ప్రణీత్, టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ పామర్తి నరసింహ రావు, సర్పంచ్ లక్ష్మీ విక్టర్ బాబు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు మంత్రి పరామర్శ

నెక్కలం గొల్లగూడెంలో ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మరణించిన టీడీపీ కార్యకర్త పి. గంగరాజు కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. ప్రభుత్వం తరఫున సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందేలా చూస్తానని మంత్రి భరోసా ఇచ్చారు. ఆగిరిపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన బెజవాడ సీతమ్మ కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు.

చాట్రాయి: కూటమి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతున్నదని టీడీపీ నాయకులు అన్నారు. మండలంలోని పర్వతాపురం గ్రామంలో ఆదివారం రాత్రి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. అర్హులైన వారికి కొత్త పింఛన్లు, పక్కా ఇళ్ళు మొదలైన పథకాలు అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని ప్రజలకు వివరించారు. టీడీపీ గ్రామ అధ్యక్షురాలు బొర్రా నాగమల్లీశ్వరి, క్లస్ట ర్-1 ఇన్‌చార్జి ఉయ్యాల దిలీప్‌కుమార్, మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ బూబత్తుల చెన్నారావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: పెదపుట్లపూడిలో టీడీపీ నాయకులు సుపరిపాలనకు తొలి అడుగు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి కరప త్రాలను పంపిణీ చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు కె. వీరాంజనేయులు, నాయ కులు అక్కల వెంకటాచలం, వడుగు గోపాలరావు, దున్న భోగేశ్వరరావు, రెడ్డి చక్రవర్తి, నడకుదిటి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.


కైకలూరు పంటకాలువను పరిశీలిస్తున్న కామినేని

కాలువలకు పూర్తిస్థాయిలో నీటి విడుదల : కామినేని

కైకలూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): శివారు ప్రాంతాలకు తాగు, సాగు నీరందించేందుకు కాలువలకు పూర్తిస్థాయిలో నీరు విడుదల చేయించామని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కైకలూరు పంట కాలువలో గుర్రపుడెక్క, తూడు తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలువలకు మంచినీరు వదిలారని పంటపొలాలకు మొదటి ప్రాధాన్యత అందేలా చూడాలని అధికారులను, నీటిసంఘాల నాయకులను ఆదేశించారు. అలాగే కాలువల అభివృద్ధి పనుల్లో సాగు నీటి సంఘాల, డీసీ చైర్మన్లు చేసిన కృషి అభినందనీయమని కాలువలను ఎక్కడికక్కడ ఎక్స్‌కవేటర్లతో అభివృద్ధి చేస్తూ నీటిపారుదలకు అవరోధం లేకుండా చేశారన్నారు. ప్రభుత్వ నిధులు సరిపోకపోయినా డీసీ చైర్మన్లు పనులు నిలుపుదల చేయకుండా నిర్వహించడం వల్లే శివారు గ్రామాలకు నీరు అందుతోందన్నారు. మాజీ ఎమ్మెల్సీ విఠలరావు, డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు, సాగునీటి సంఘాల అధ్యక్షులు బొల్లింపల్లి కృష్ణారావు, వడ్డి సాధికార సమితి కన్వీనర్ బలే ఏసురాజు, టీడీపీ నేతలు వల్లభనేని శ్రీనివాస చౌదరి, పోకల జోగిరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ...

అనారోగ్యానికి గురై చికిత్స పొందిన 18 మందికి సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదివారం కైకలూరు మండలం వరహాపట్నంలో ఆయన స్వగ్రహం వద్ద అందజేశారు.



చాట్రాయిలో టీఆర్పీ కాలువ పూడికతీత.. పూడికతీత అనంతరం చాట్రాయి టీఆర్పీ కాలువ

ముమ్మరంగా కాలువ పూడికతీత

చాట్రాయి, జూలై 20(ఆంధ్రజ్యోతి): తమ్మిలేరు ప్రాజెక్టు రైట్ కెనాల్ పరిధిలోని చాట్రాయి టీఆర్పీ కాలువ పూడితీత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. కాలువలో జమ్మి, తూడు పెరిగి నీటి ప్రవాహానికి అడ్డుపడి ఆయకట్టుకు నీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. రైతులు సమస్యను ఇటీవల జరిగిన ప్రాజెక్టు కమిటీ సమావేశం దృష్టికి తీసుకువెళ్ళటంతో అధికారులు స్పందించి పూడికతీత పనులు చేపట్టారు. పూడిక తీత తరువాత నీటి ప్రవాహం పెరగటంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లక్ష్యంపై గురి పెట్టండి..

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు యూపీఎస్సీ ర్యాంకర్, పూర్వ విద్యార్థిని సాయి శివాని సూచన


సాయి శివానిని సన్మానిస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్

నూజివీడు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జీవితంలో ఏం కావాలో నిర్ణయించుకుని దానిపై దృష్టి పెట్టి శ్రమిస్తే సాధ్యం కానిది లేదని యూపీఎస్సీలో 11వ ర్యాంక్ సాధించిన ట్రిపుల్ ఐటీ విద్యార్థిని సాయి శివాని అన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఆదివారం జరిగిన యూపీఎస్సీ ప్రేరణ- వ్యూహ శిబిరం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతికూల ఆలోచనా విధానాన్ని విడిచిపెట్టి క్రమశిక్షణ, కఠోర శ్రమతో అనుకున్న లక్ష్యం చేరుకోవచ్చు అన్నారు. యూపీఎస్సీ జాతీయ స్థాయిలో నిర్వహించే ఒకే పరీక్ష ద్వారా 23 ప్రభుత్వ సర్వీసులకు ఎంపిక కావచ్చని తెలిపారు. యూపీఎస్సీలో జాతీయస్థాయి విజేతల మనోగతాలను, ప్రిపరేషన్ అయిన పద్ధతులను గమనించాలన్నారు. ఎక్కువ సమయం పుస్తక పఠనం, రివిజన్‌పైన దృష్టి పెట్టాలన్నారు. ఇంటర్వ్యూలో వ్యక్తిగత వివరాలతో పాటు డెసిషన్ మేకింగ్, ప్రజంటేషన్, స్పష్టత అనే అంశాలపై ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. తన వ్యక్తిగత జీవితం తల్లిదండ్రుల ప్రోత్సాహం, ప్రిపరేషన్ అయిన పద్ధతి, ఇంటర్వ్యూ విధానం గురించి ఆమె విద్యా ర్థులకు వివరించారు. విద్యార్థులు అడిగిన పలు సందేహాలను ఆమె నివృత్తి చేశారు. తొలుత ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ సాయి శివాని 2016-22 మధ్య కాలంలో ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఈసీ నుంచి ఇంజనీరింగ్ డిగ్రీ పొందారన్నారు. అనంతరం యూపీఎస్సీ నిర్వహించిన పరీక్షలకు హాజరై ఈ ఏడాది జాతీయస్థాయిలో 11వ ర్యాంక్ సాధించి కళాశాల ప్రతిష్ఠ పెంచారని అభినందించారు. ఆమె ద్వారా ప్రేరణ పొంది భవిష్యత్ లక్ష్యాలను నిర్ణయించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఆమెను ట్రిపుల్ ఐటీ స్టాఫ్ సన్మానించారు. ఏవో లక్ష్మణరావు, డీఎం చిరంజీవి పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న డాక్టర్ మనోజ్

డాక్టర్ మనోజ్‌కు అవార్డు

ముదినేపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రితిక ఫౌండేషన్ సామాజిక సేవ చేసేవారికి ప్రతి ఏటా అందించే నంది అవార్డు ఈ ఏడాది ముదినేపల్లికి చెందిన డాక్టర్ అంబుల మనోజ్‌కు లభించింది. ఈ అవార్డును ఆదివారం విజయవాడలోని ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వడాలి జగన్నాథస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు డాక్టర్ మనోజ్‌కు అంద జేశారు. అమరావతి రాజధాని నిర్మాణానికి విరాళం అందజేయటంతోపాటు తన కుమార్తె అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవితో కలసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందున డాక్టర్ మనోజ్‌కు ఈ నంది అవార్డు దక్కింది. ఫౌండేషన్ చైర్మన్ నిత్యానంద చారి పాల్గొన్నారు.



సంతాన నాగేంద్రస్వామికి, కొల్లేటికోట పెద్దింటమ్మ వారికి సారె తీసుకువెళ్తున్న భక్తులు


చినకామనపూడిలో సీతమ్మకు సారె

సారె సమర్పణ

కైకలూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): కైకలూరు శాంప్ డ్రైన్ గట్టుపై గల సంతాన నాగేంద్రస్వామి వారికి భక్తులు ఆషాఢ సారెను సమర్పించారు. ఆదివారం సారెను మహిళలు పెద్దఎత్తున ఊరేగింపుగా తీసుకువచ్చి నాగేంద్రస్వామితో పాటు గ్రామంలోని శ్రీగంగానమ్మ అమ్మవారికి, రామాల యంలోని దుర్గమ్మ వారికి, సంతాన నాగేంద్రస్వామి ఆలయంలో కొలువైయున్న శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారికి, గంగా పార్వతీసమేత ఆనంద లింగేశ్వరస్వామికి సమర్పించారు. మేళతాళాల మధ్య మహిళలు పెద్దఎత్తున ఊరేగింపుగా ఆలయాలకు చేరుకుని సారెలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెద్దింటి అమ్మవారికి సారె సమర్పణ...

కొల్లేటికోట పెద్దింటి అమ్మవారికి ఆదివారం పలు ప్రాంతాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి సారె అందించి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజలు జరిపి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈవో కూచిపూడి శ్రీనివాస్ భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముదినేపల్లి: చినకామనపూడిలో ఆదివారం ఏడు ఆలయాల్లో అమ్మవార్లకు మహిళలు సారె సమర్పించారు. సర్పంచ్ చిట్టూరి నాంచారయ్య ఆధ్వర్యంలో గ్రామంలోని గంగానమ్మ, సీతాదేవి, రుక్మిణిదేవి, శ్రీవల్లీ దేవసేన, సువర్చలా, పార్వతీ దేవి, మహాలక్ష్మమ్మ వార్లకు మహిళలు పెద్ద సంఖ్యలో ఆషాఢ సారె సమర్పించి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు.


కృష్ణయ్యను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

కృష్ణయ్య ప్రమాణ స్వీకారం

ముసునూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వలస పల్లి కో-ఆపరేటివ్ సొసైటీ త్రిసభ్య కమి టీ సభ్యులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యదర్శి వీర మాచనేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా కొల్లి కృష్ణయ్య, డైరెక్టర్లుగా కొలుసు సత్యనారాయణ, కర్ర మహాలక్ష్మితో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షుడిని టీడీపీ మండల అధ్యక్షులు గద్దె రఘుబాబు, గ్రామ అధ్యక్షులు మేదరమెట్ల సురేంద్ర, నాయకులు కొల్లి గంగారామ్, మామిడిశెట్టి గిరిబాబు, సూర్యదేవర శ్రీనివాసరావు, లక్కపాము కాంతారావు తదితరులు సత్కరించారు. సొసైటీ అభివృద్ధితోపాటు రైతులకు ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా కృష్ణయ్య తెలిపారు.

బస్సు ఢీకొని వృద్ధురాలికి గాయాలు

చింతలపూడి, జూలై 20(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్త బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు ఢీకొని చాట్రాయి గ్రామానికి చెందిన తుమ్మల లక్ష్మీ అనే వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. కాలు నుజ్జునుజ్జు కావడంతో చింతలపూడి ఏరియా ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్సకు విజయవాడ తరలించారు.

అప్రకటిత 'కోత'లతో వెతలు

కలిదిండి, జూలై 20(ఆంధ్రజ్యోతి): అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు పలు అవస్థలు పడుతు న్నారు. ఒక పక్క వేసవిని తలపించేలా ఎండ తీవ్రతతో ఉక్కపోత, మరో పక్క విద్యుత్ కోతతో వృద్ధులు, గర్భిణులు చంటి పిల్లలు అల్లాడుతున్నారు. చేతి వృత్తుల వారు సైతం ఇబ్బందులు పడుతున్నారు. రొయ్యల చెరువుల్లో ఏరియేటర్లు నిలిచిపోవటంతో అద్దె జనరేటర్లను ఏర్పాటు చేసుకుని ఏరియేటర్లు తిప్పటంతో అదనపు వ్యయమవుతుందని ఆక్వా రైతులు వాపోతున్నారు. ఆకస్మాత్తుగా ఏరియేటర్లు తిరగటం ఆగితే చెరువుల్లో ఆక్సిజన్ లోపించి రొయ్యలు మృత్యువాత పడి లక్షలాది రూపాయల నష్టం సంభవించే ప్రమాదం ఉంది. దీంతో రేయింబవళ్లు చెరువుల వద్ద కాపలా ఉంటూ విద్యుత్ కోత విధించగానే ప్రత్యామ్నాయంగా జనరేటర్లను ఏర్పాటు చేసుకుని రొయ్యలను కాపాడుకుంటున్నారు. విద్యుత్ కోతలను ఎత్తేయాలని ప్రజలు కోరుతున్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

కైకలూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): కోడిపందేల శిబిరంపై కైకలూరు టౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఆదివారం మండలంలోని తామరకొల్లు గ్రామంలో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేశారు. దాడుల్లో ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకుని, 2 కోళ్ళు, రూ.1250 నగదును స్వాధీనం చేసుకున్నట్లు టౌన్ ఎస్సై ఆర్. శ్రీను తెలిపారు.